నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంపై ఏసీబీ దాడులు..

## నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంపై ఏసీబీ దాడులు..

వినాయక్ నగర్, సెప్టెంబర్03 : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పై అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగి తనను లంచం డిమాండ్ చేస్తున్నట్లుగా ఓ బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం పై దాడి చేశారు. ఆర్ ఐ ( రెవెన్యూ ఇన్స్పెక్టర్) గా నిజామాబాద్ జోన్ 2, జోన్4 పరిధిలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ చారి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వద్ద నుండి రూ.7 వేలు లంచం తీసుకోవడంతో అప్పటికే అక్కడ మాట వేసి ఉన్న అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆర్ఐని రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నారు.ప్రస్తుతం ఏసీబీ అధికారులు మున్సిపల్ కార్యాలయంలో ఇతర అధికారులు, ఉద్యోగుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఈరోజు ఏసీబీకి పట్టుబడిన సదరు ఆర్ఐ శ్రీనివాసచారి గతంలో బోధన్ మున్సిపల్ లో విధులు నిర్వహించేవాడు. అక్కడ విధులు నిర్వహించే సమయంలో సైతం సదరు ఉద్యోగి అక్కడ సైతం ఏసీబీకి పట్టుబడినట్లు సహా ఉద్యోగుల ద్వారా తెలిసింది.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :164 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 04-09-2025 | పేజీలు:4 వెల: 2.00


## బీఆర్ఎస్‌కు,ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా



హైదరాబాద్,పార్టీ నుంచి సస్పెండ్ అయిన తర్వాత కవిత మొదటి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్టు తెలిపారు. స్పీకర్ ఫార్మాట్‌లో ఎమ్మెల్సీకి కవిత రాజీనామా చేశారు. ఇదే సమయంలో తాను ఏ పార్టీలో చేరడం లేదని క్లారిటీ ఇచ్చారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయవద్దని సూచించారు. అక్రమ కేసుల్లో నేను జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నాను తప్ప.. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు వ్యతిరేకంగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. నా సస్పెన్షన్ వార్తలను మీడియాలో చూశాను. సస్పెండ్ చేస్తున్నట్టు నిన్న బీఆర్ఎస్ నుంచి ఓ ప్రకటన వచ్చింది. లేఖలో ఉన్న రెండు అంశాలపై నేను మాట్లాడాలి అనుకుంటున్నాను. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడికి వెళ్లి మాత్రమే నేను మాట్లాడాను. గులాబీ పార్టీ కండువా కప్పుకుని పార్టీ తరఫున ప్రజా సమస్యలపై పోరాడటం పార్టీ వ్యతిరేకమా?. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడికి వెళ్లి మాత్రమే నేను మాట్లాడాను. లేఖలో ఉన్న రెండు అంశాలపై నేను మాట్లాడాలి అనుకుంటున్నాను.

కోట్లలో ఒక్కరు కేసీఆర్..

కేసీఆర్ నుంచే సామాజిక తెలంగాణ ఎజెండా నేర్చుకున్నాను. పని గట్టుకుని నాపై తప్పుడు ప్రచారం చేశారు. నా తండ్రి చిటికెన వేలు పట్టుకుని రాజకీయాల్లో ఓనమాలు నేర్చుకున్నాను. కేసీఆర్ లాంటి తండ్రి కోట్లలో ఒక్కరు ఉంటారు. అలాంటి వ్యక్తి నాకు తండ్రిగా ఉన్నారు. అది నా అదృష్టం. ప్రస్తుత పరిస్థితుల కారణంగా నా తల్లితో కూడా నేను మాట్లాడటం లేదు. ఆమెను కలవలేకపోతున్నారు. ఇలాంటి కష్టం ఏ బిడ్డకు రాకూడదు. ఇద్దరు వ్యక్తులు నా కుటుంబాన్ని విచ్ఛినం చేశారు. నాశనం చేయాలని చూశారు. విధి అనేది ఒక్కటి ఉంది. కచ్చితంగా వారికి కాలమే సమాధానం చెబుతుంది. తప్పకుండా అనుభవిస్తారు.

రేవంత్‌తో కలిసి హరీష్ కుట్రలు..

నేను మొన్న చెప్పిన ఇద్దరు నేతలు నాపై చిలువలు పలువలుగా ప్రచారం చేశారు. హరీష్ రావు, సంతోష్‌రావు ఇంట్లో ఉన్న బంగారంతో సామాజిక తెలంగాణ అయితదా?. నాపై కుట్రలు జరుగుతుంటే చెల్లిగా.. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌ని నాపై ప్రచారాన్ని ఆపాలని వేడుకున్నాను. పార్టీలో ఏం జరుగుతుందో చూడండి నాన్న. నేను కూడా మీలాగానే ముఖం మీదనే మాట్లాడతాను. రేపు కేటీఆర్, మీపై కూడా కుట్ర జరగొచ్చు. రేవంత్ రెడ్డితో కలిసి హరీష్ ఒకే విమానంలో ప్రయాణించారు. రేవంత్‌కు హరీష్ సరెండర్ అయిన తర్వాతే నాపై కుట్రలు మొదలయ్యాయి. వ్యక్తిగత లబ్ధి కోరుకునే వ్యక్తులు పార్టీ నుంచి నన్ను బయటపడేశారు. పార్టీని హస్తగతం చేసుకోవడానికి జరుగుతున్న కుట్ర ఇది.

రేపటి రోజు రామన్నకు ప్రమాదమే..

రేపు ఇదే ప్రమాదం రామన్నకు కూడా పొంచి ఉంది. హరీష్ రావు బీజేపీతో కూడా టచ్‌లో ఉన్నారు. హరీష్, రేవంత్ ఒకే విమానంలో పర్యటించినప్పటి నుంచే నాపై కుట్రలు ప్రారంభమయ్యాయి. డబ్బు సంపాదించాలని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం నన్ను పార్టీ నుంచి బయటకు పంపారు. రేవంత్, హరీష్ కుమ్మక్కై నాపై కుట్రలు చేశారు. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు సైట్ మార్చినప్పుడు మంత్రి హరీష్‌రావే కదా?. ఎస్సీ, ఎస్టీ, బీసీ హస్టళ్లకు హరీష్ డెయిరీ నుంచి పాల పంపిణీ జరిగింది. నాపై తప్పుడు ప్రచారం జరుగుతుంటే వర్కింగ్ ప్రెసిడెంట్ స్పందించరా?. 103 రోజులైనా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడగరా?. నన్ను సస్పెండ్ చేసినా.. పార్టీలో నేను కోరుకున్న ప్రజాస్వామ్యం వచ్చింది.

హరీష్ వల్లే ఓటములు..

హరీష్ ట్రబుల్ షూటర్ కాదు.. డబుల్ షూటర్. ట్రబుల్ క్రియేట్ చేసి దీన్ని సాల్వ్ చేసినట్టు చెప్పుకుంటారు. మీడియా మేనేజ్‌మెంట్‌లో హరీష్ సూపర్. 2018 ఎన్నికల్లో 25 మంది ఎమ్మెల్యేలకు హరీష్ అడిషనల్ ఫండింగ్ ఇచ్చారు. ఆయన ఫండింగ్ చేసిన వ్యవహారం నాకు స్పష్టంగా తెలుసు. రామన్నను ఓడించడానికి సిరిసిల్లకు 60 లక్షలు పంపారు. తెలంగాణ ఉద్యమం మొదటి నుంచి డే-1 నుంచి హరీష్ రావు లేరు. ఎమ్మెల్యే పదవికి, డిప్యూటీ స్పీకర్ పదవికి కేసీఆర్ రాజీనామా చేస్తుంటే హరీష్‌రావు వద్దన్నారు. తొమ్మిది, పది నెలల తర్వాత వచ్చారు. హరీష్ రావు నక్క జిత్తులను గమనించండి. నిజామాబాద్‌లో నా ఓటమిలో కూడా కుట్రలు చేశారు. కామారెడ్డిలో కేసీఆర్‌ను కూడా ఓడించే ప్రయత్నం చేశారు. ఇందులో సంతోష్ రావు హస్తం కూడా ఉంది. హుజురాబాద్‌లో ఈటల రాజేందర్ గెలుపునకు కూడా హరీషే కారణం. హరీష్ వల్లే రఘునందన్ రావు, ఇతర కీలక నేతలు బయటకు వచ్చారు. దుబ్బాకలో బీఆర్ఎస్ ఓడిపోయింది. ఇలాంటివి చాలానే జరిగాయి. జగ్గారెడ్డి, విజయశాంతి, విజయరామారావు కూడా పార్టీ వీడింది హరీష్ రావు వల్లే. ఆరడుగుల బుల్లెట్ ఇప్పుడు నాకు గాయం చేసింది. తర్వాత మీకు గాయం చేస్తుంది.

గ్రీన్ ఇండియా పేరుతో సంతోష్ రావు ఓవరాక్షన్..

హరితహారం కేసీఆర్ పెడితే.. గ్రీన్ ఇండియా చాలెంజ్ పేరుతో నకిలీ కార్యక్రమం చేపట్టాడు. సంతోష్ రావు కూరలో ఉప్పు లాంటి వాడు. చిరంజీవి, ప్రభాస్ లాంటి సినీ నటులను మోసం చేసిన గ్రీన్ ఇండియా కార్యక్రమంలో పాల్గొనేలా

## కర్ణాటక కాంగ్రెస్‌లో మరోసారి ముసలం..

బెంగళూర్ :కర్ణాటక కాంగ్రెస్ లో మరోసారి ముసలం మొదలైంది. పదవుల పంచాయితీ మళ్లీ మొదటికొచ్చింది. అధికారంలోకి రాగానే సీఎం పదవి కోసం డీకే శివకుమార్, సిద్ధరామయ్య తలపడగా మరోసారి అత్యున్నత పదవి కోసం కాంగ్రెస్‌లో కుమ్ములాటలు జోరందుకున్నాయి. సీఎం పదవి నుంచి సిద్ధరామయ్యని తప్పించి ఆ స్థానంలో డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్‌ను కూర్చోబెట్టాలంటూ మెజారిటీ ఎమ్మెల్యేలు గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వివాదం వేళ డీకే శివకుమార్ బీజేపీలో చేరబోతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఇప్పుడు తాజాగా మరో ట్విస్ట్ చోటు చేసుకుంది.డీకే, సిద్ధరామయ్య వర్గీయులు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఒకరిపై ఒకరు మాటల యుద్ధానికి దిగుతున్నారు. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు అని బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. మాజీ మంత్రి కేఎన్ రాజన్న బీజేపీలో చేరబోతున్నారంటూ ఎమ్మెల్యే హెచ్‌సీ బాలకృష్ణ ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాజన్న రాష్ట్ర సహకార మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. రాహుల్ గాంధీ ఓట్ల చోరీ ఆరోపణలపై వ్యతిరేక గళం వినిపించడంతోనే ఆయనను గత నెల పదవి నుంచి తప్పించారు.ఈ నేపథ్యంలో తన తండ్రి రాజన్న పార్టీ మారుతున్నారని ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ, మాజీ మంత్రి తనయుడు రాజేంద్ర రాజన్న తీవ్రంగా స్పందించారు. బీజేపీలో చేరే బృందంలో బాలకృష్ణ ఉ



న్నారంటూ ఆరోపించారు. సీఎం పదవి కోసం పాకులాడుతున్న నేత (డీకే శివకుమార్‌ను ఉద్దేశించి) వెంట వెళ్లబోతున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన తండ్రికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారంటూ డీకే పేరును ప్రస్తావించకుండా విమర్శలు చేశారు. తాము సీఎం సిద్ధరామయ్యకు సన్నిహితులం కాబట్టే ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. తన తండ్రి పదవి పోవడం వెనుక రహస్య హస్తం ఉందంటూ ఆరోపణలు గుప్పించారు. ఇలా సిద్ధరామయ్య, డీకే వర్గీయులు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకోవడం కర్ణాటక కాంగ్రెస్‌లో మరోసారి అలజడి మొదలైంది.

## కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా.. సీబీఐ విచారణకు ఎందుకు ఇచ్చినట్టు!



హైదరాబాద్,కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా.. సీబీఐ విచారణకు ఎందుకు ఇచ్చినట్టు అని ప్రభుత్వంను ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు.సీబీఐ మీద నమ్మకం లేదన్న కాంగ్రెస్.. ఇప్పుడు ఎందుకు ఇచ్చినట్టు అని విమర్శించారు. బీజేపీపై బట్ట కాల్చి మీద వేసేందుకు సీబీఐకి కేసు అప్పగించారని.. సీబీఐకి ఈ ప్రభుత్వం సహకరిస్తుందన్న నమ్మకం తనకు లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అనే చెప్పేందుకు.. ఇదంతా ఒక పన్నాగం అని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను కాపాడేందుకే కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందని, 20 నెలల కింద ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేదని డీకే అరుణ చెప్పారు.'20 నెలల కింద ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేది. బీజేపీ పైన బురద జల్లేందుకే ఈ సీబీఐ విచారణ. బీఆర్ఎస్‌ను కాపాడేందుకే కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోంది. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకే కాంగ్రెస్ చిత్తశుద్ధితో పని చేస్తుంది. కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా సీబీఐ విచారణకు ఎందుకు ఇచ్చినట్టు. మేము అధికారంలో అవినీతి సొమ్మును కక్కిస్తామని అన్నారు. కానీ వారిని కాపాడడంలోనే బిజీగా ఉన్నారు. సీబీఐ మీద నమ్మకం లేదన్న కాంగ్రెస్.. సీబీఐకి ఎందుకు ఇచ్చినట్టు. బీజేపీపై బట్ట కాల్చి మీద వేసేందుకు సీబీఐకి ఇచ్చారు. సీబీఐకి ఈ ప్రభుత్వం సహకరిస్తుందని నమ్మకం లేదు. సాక్ష్యాలు ఇవ్వరు.. మాయం చేస్తారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అనే చెప్పేందుకు ఇదంతా ఒక పన్నాగం. బీఆర్ఎస్ హైడ్రామా ఆడుతుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటే. కేసీఆర్ లేకుంటే కవిత ఎవరు' అని ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు.'కేసీఆర్ వారసత్వం పోరాటం.. ఒకరి పైన ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. కేసీఆర్ సపోర్ట్ లేకుండా కాళేశ్వరంలో ఏదైనా జరిగిందా?. అవినీతికి బాధ్యత ఆ కుటుంబంలోని అందరిదే. లిక్కర్ కేసులో కవిత కూడా జైలుకు పోయి వచ్చింది. గద్వాలలో అభివృద్ధి కుంటుపడింది. అక్కడ ప్రజా ప్రతినిధికి ఎలాంటి సంబంధం లేదు. మెడికల్ కాలేజీలో మా ప్రయత్నం కూడా ఉంది. ఈ విషయంపై చర్చకు సిద్ధం. రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో.. ఇదంటే ఆయనకు కోపం వస్తుంది. చేతకాని వాళ్ళు చాలా మాట్లాడుతారు. ఆయన చేతనయ్యి గెలవలేదు.. చావు తప్పి లొట్టపోయి గెలిచారు. మహబూబ్ నగర్ నా సొంత జిల్లా. నేను ఎక్కడో పోయి పోటీ పడలేదు. మా ఇంట్లో నుండే ఆయనకి రాజకీయ జీవితం.. మేము లేకపోతే అయన ఎక్కడ. కొమ్ములొచ్చి చాలా మాట్లాడుతున్నారు' అని డీకే అరుణ ఫైర్ అయ్యారు.

## 9.8 లక్షల టన్నులకు 5.3 లక్షల టన్నులే సరఫరా చేశారు

హైదరాబాద్: ప్రతి నెలలో సరఫరా చేయాల్సిన యూరియాలో కేంద్ర ప్రభుత్వం కోతపెట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సెప్టెంబర్‌లో రావాల్సిన 1.6 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయలేదని మండిపడ్డారు. బుధవారం తుమ్మల మీడియాతో మాట్లాడారు. ఇతర దేశాల నుంచి వస్తోన్న యూరియానే సరఫరా చేస్తున్నారని తుమ్మల తెలియజేశారు. దేశంలో యూరియాను సరైన సమయంలో ఉత్పత్తి చేయలేదని, దేశ వ్యాప్తంగా ఉన్న యూరియా కొరత తెలంగాణను కూడా పీడిస్తోందని, తెలంగాణను ఇప్పటివరకు 9.8 లక్షల టన్నుల్లో 5.3 లక్షల టన్నులే సరఫరా చేశారని దుయ్యబట్టారు. ఇతర దేశాల నుంచి యూరియాను ఎందుకు దిగుమతి చేసుకోవడంలేదని తుమ్మల ప్రశ్నించారు.అన్ని పంటలకు సెప్టెంబర్ చివరి కోటా యూరియా వేయాలన్నారు. ఇటీవల భారీ వర్షాలతో ఆరేడు జిల్లాల్లో అన్ని శాఖల్లో తీవ్ర నష్టం జరిగిందని, తెలంగాణలో పంటలు, రోడ్లు, మౌలిక సౌకర్యాలు దెబ్బతిన్నాయని, చేనేత రంగంపై పన్నులు ఉండకూడదని కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నామని, వ్యవసాయ పనిముట్లపై జీఎస్టి రద్దు చేయాలని



కేంద్రాన్ని కోరుతున్నామని డిమాండ్ చేశారు. ఆయిల్‌పామ్ దిగుమతులపై సుంకాలు 40 శాతానికి పెంచాలని, బిఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్ వ్యవహారం తమకు సంబంధం లేదన్నారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఇచ్చామని, ఏది ఉన్నా వాళ్లే చూసుకుంటారని వివరించారు.

## అతడి ద్వారానే సెటిల్‌మెంట్లు చేసిన సంతోష్

హైదరాబాద్, సెప్టెంబర్ 03: బీఆర్ఎస్ పార్టీలో తాజాగా చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పందించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దుబ్బాకకు మీ కుటుంబం చేసిన అన్యాయం గురించి తాను అనేక సార్లు చెప్పానన్నారు. అలాగే దుబ్బాకు హరీష్ రావు వల్లే అన్యాయం జరిగిందని కూడా తాను ఆనాడే చెప్పానని తెలిపారు. బీఆర్ఎస్‌లో తాను ఓడిపోవడానికి కారణం ఏమిటో కూడా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు గతంలోనే చెప్పానన్నారు. ఒకే విమానంలో సీఎం రేవంత్ రెడ్డి, హరీష్ రావులు ప్రయాణం చేశారని తాను గతంలోనే చెప్పానని పేర్కొన్నారు. అయితే కవిత చెప్పిన దాంట్లో కొత్తదనం ఏమీ కనిపించడం లేదన్నారు.మోకిల్లాలో జరుగుతున్న విల్లా ప్రాజెక్ట్‌పై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అలాగే పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, నవీన్ రావులపై వెంటనే ఏసీబీ డీజీతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన సూచించారు. గతంలో నార్సింగి టాస్క్‌ఫోర్స్ డీసీపీగా సందీప్ రావు చేసిన అరాచకాలు చెప్పాల్సి ఉండేదన్నారు. సంతోష్ రావు వియ్యంకుడి హోదాలో మాత్రమే సందీప్ రావు అనేక అరాచకాలు చేశారని వివరించారు. అతడి ద్వారానే సంతోష్ రావు సెటిల్‌మెంట్లు చేసేవారన్నారు.ఇక సందీప్ రావును కేసులో ఎందుకు చేర్చ లేదంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. పార్టీలోకి వెళ్ళాలా? వద్దా? అని కవిత ఊగిసలాడుతున్నారని అనిపిస్తుందంటూ



అభిప్రాయపడ్డారు. ఆ ఎమ్మెల్సీలపై పార్టీలో ఉన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదంటూ కవితపై ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. అలాగే నగర శివార్లలోని ల్యాండ్ కన్వర్షన్ చేసిన భూములు విషయం సైతం చెప్పాల్సిందన్నారు. కాళేశ్వరం విచారణపై రెండేళ్ళ సమయం వృథా చేసిందంటూ రేవంత్ రెడ్డిప్రభుత్వంపై మండిపడ్డారు. సంతోష్ రావు ఈ స్థాయిలో ఆస్థులు ఎలా సంపాదించారో కూడా విచారణ జరిపించాలన్నారు. అయితే తాను ఎవరి దయా దాక్షిణ్యాల వల్ల మెదక్ ఎంపీగా గెలవలేదని స్పష్టం చేశారు. ఇది నూటికి నూరు శాతం కరెక్ట్ అని ఆయన పేర్కొన్నారు.

## ఓ వైపు మిలాద్.. గణేష్ నిమజ్జనం,భద్రతపై కమిషనర్ సమీక్ష




హైదరాబాద్,శుక్రవారం ముస్లింలు జరుపుకునే మిలాద్ ఫెస్టివల్, శనివారం గణేష్ నిమజ్జనం కావడంతో హైదరాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. వరుసగా రెండు పండుగలు రావడంతో భద్రతను సమీక్షించారు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్. సాయంత్రం కమిషనర్ ఆఫీసులో వివిధ జోన్ల పోలీసు అధికారులతో సమీక్ష చేపట్టారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో మిలాద్ ఫెస్టివల్‌ను జరుపుకుంటారు. ఈద్ మిలాద్-ఉన్-నబి లేదా మిలాద్-ఉన్-నబి అని పిలుస్తారు.ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే పండుగల్లో ఇది ఒకటి. ఇస్లామిక్ చంద్రమాన క్యాలెండర్‌లోని మూడో నెల రబీ అల్-అవ్వల్‌లో జరుపుకుంటారు. ముఖ్యంగా సూఫీ-బరేల్వీ వర్గాలు దీనికి అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. ప్రవక్త ముహమ్మద్ జన్మదినోత్సవాన్ని మిలాద్ ఫిస్టెవల్ సూచిస్తుందని చెబుతారు.ప్రతీ ఏడాది సెప్టెంబర్ 4 లేదా 5 చుట్టూ వస్తుంది. ఈసారి సెప్టెంబర్ ఐదున వచ్చింది. శుక్రవారం మిలాద్ ఫెస్టివల్ జరగనుంది. మరసటి రోజు అంటే శనివారం హైదరాబాద్ సిటీలో గణేష్ నిమజ్జనం జరగనుంది. వరుసగా ముస్లిం, హిందువుల పండుగ రావడంతో సిటీ కమిషనర్ దృష్టి పెట్టారు.భద్రత విషయం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రెండు పండుగలు ముఖ్యమైనవి కావడంతో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడకూడదన్నారు. దీంతో జోన్ల వారీగా సమీక్షలు పూర్తి అయ్యాయి. అధికారులంతా నమ్మకంగా, సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్నారని చెప్పారు. మిలాద్, గణేష నిమజ్జనం సమయంలో ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నొక్కి చెప్పారు.జేబు దొంగతనం, వేధింపులు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను నివారించడానికి పోలీసు బృందాలు, షీ టీమ్స్, వాలంటీర్లు 24 గంటలూ నిఘా ఉంచాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా నిర్వాహకులు-వాలంటీర్లు రాత్రిపూట గణేష్ మండపాల వద్ద ఉండాలని సూచించారు. గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా భక్తులు-ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.మరోవైపు కూకట్‌పల్లి రంగధాముని చెరువును పరిశీలించారు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి. వినాయక నిమజ్జనాల ఏర్పాట్లు పరిశీలించారు. గణేష్ నిమజ్జం కోసం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 6 వేల మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గస్తీతోపాటు సీసీటీవీ పర్యవేక్షణ ఉండాలన్నారు.

## దొంగ చేతికి తాళాలిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి



కరీంనగర్, సెప్టెంబర్ 03: కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై సీబీఐ వేయాలని తొలుత డిమాండ్ చేసింది తామేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. అయితే తమ డిమాండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్ల కాలయాపన చేశారని మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా సీబీఐ విచారణ ఎలా చేస్తుందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కమిషన్ రిపోర్ట్ బీఆర్ఎస్ చేతిలో పెట్టి.. సీబీఐతో విచారణా అని ఆయన వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఘోష్ కమిషన్ రిపోర్ట్ బీఆర్ఎస్‌కు ఇచ్చి.. దొంగ చేతికి సీఎం రేవంత్ రెడ్డి తాళాలు ఇచ్చారంటూ ఎద్దేవా చేశారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బిడ్డ కవిత చెప్పిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ గుర్తు చేశారు

## సంపాదకీయం

గురువారం 04-09-2025

## కరీంనగర్ గాంధీ.. బోయినిపెల్లి


దేశచరిత్రలో స్వాతంత్ర్యోద్యమం, సామాజిక సంస్కరణలు, గాంధేయ సిద్ధాంతాల అనుసరణ, ప్రజాసేవలు, సాహిత్య వికాసం వంటి రంగాల్లో చిరస్మరణీయ కృషి చేసిన మహనీయులలో కరీంనగర్ గాంధీగా పేరు గాంచిన బోయినిపెల్లి వెంకట రామారావు ఒకరు. ఆయన జీవితం అనేది కేవలం వ్యక్తిగత ప్రయాణం కాక, స్వాతంత్ర్య పోరాటం నుంచి సమాజ హితానికి అంకితం అయిన ఒక యుగ చరిత్ర. 1920 సెప్టెంబర్ 2న కరీంనగర్ జిల్లా తోటపెల్లిలో పద్మనాయక కుటుంబంలో జన్మించిన వెంకట రామారావు చిన్ననాటి నుంచే స్వతంత్ర ఆలోచనలతో పెరిగారు. మహాత్మా గాంధీ ఆలోచనలకు, ఆర్యసమాజ ప్రభావానికిలోనై, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ, సమాజంలో సమానత్వం కోసం కృషి ప్రారంభించారు. నిజాం పాలనలో ఉర్దూ మీడియం బలవంతపు అమలుకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలబడి, రైతాంగ సాయుధ పోరాటంలో క్రియాశీలక పాత్ర వహించారు. 1935 చివరలో సిరిసిల్లలో జరిగిన ఆంధ్ర మహాసభలో స్వచ్ఛంద దళనేతగా వ్యవహరించి యువతలో చైతన్యం నింపారు. 1940లో చిల్లాకొడూరు, 1948లో జగిత్యాల, కోరుట్ల ప్రాంతాల్లో వితంతు పునర్వివాహాలు నిర్వహించి, సమాజ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 1945లో హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించి సహపంక్తి భోజనాన్ని నిర్వహించడం ఆయన సంస్కరణాత్మక దృక్పథానికి నిదర్శనం. స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాక విలేకరిగా కూడా ఆయన సేవలు అశేషం. సురవరం ప్రతాపరెడ్డి సంపాదకత్వంలోని గోల్కొండ పత్రికలో విలేకరిగా పనిచేశారు. నిజాం పాలన ఆయనకు భయపడింది. కుటుంబ సభ్యులను వేధించి, తండ్రి కొండల్ రావును మాలీ పటేల్ పదవి నుంచి తొలగించారు. ఆయన తలపై బహుమతి కూడా ప్రకటించారు. జమ్మికుంట రైల్వే లైను తొలగింపు కుట్ర కేసులో జైలుకు పంపబడ్డారు. 1948లో జైలులోనే గాంధీ హత్య వార్త విని, సంతాప సభ నిర్వహించారు. స్వాతంత్ర్యానంతరం ఆయన కేవలం రాజకీయ కార్యకలాపాలకు పరిమితం కాలేదు. గ్రామీణ పరిశ్రమలకు, ఖాదీ ఉద్యమానికి అంకితమయ్యారు. 1981లో ఖాదీ నవనిర్మాణ సమితిని స్థాపించి గ్రామీణ చేతివృత్తులను ప్రోత్సహించారు. అఖిల భారత సర్వసేవా సంఘంలో సభ్యునిగా వ్యవహరించి గాంధేయవాదానికి అంకితమయ్యారు. 1994లో నందమూరి తారకరామారావు ప్రభుత్వం మద్యనిషేధం అమలు చేసినప్పుడు జిల్లా కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. తరువాత చంద్రబాబు నాయుడు మద్యనిషేధాన్ని ఉపసంహరించుకున్నప్పుడు దీక్షలు, సత్యాగ్రహాలు నిర్వహించారు. సామాజిక సేవలతోపాటు సాహిత్యాభివృద్ధికీ విశేష కృషి చేశారు. 1939లో కేవలం 19ఏళ్ల వయసులో ఆంధ్ర విద్యాభివర్ధినీ గ్రంథాలయాన్ని స్థాపించారు. మరణించే వరకూ ఈ గ్రంథాలయాన్ని కొనసాగించారు. గ్రంథాలయోద్యమానికి జీవితాన్నే అర్పించారు. హైదరాబాద్‌లో 'దక్షిణ భారత హిందీ ప్రచారసభ' వ్యవస్థాపక సభ్యులు. జిల్లా గ్రంథాలయ సంస్థకు పలుమార్లు అధ్యక్షుడిగా పని చేశారు. 1962లో కరీంనగర్ జిల్లా రచయితల సంఘాన్ని స్థాపించి, కవిసామ్రాట్, దివాకర్ల, వానమామలై, ధూపాటి, ఖండవల్లి, పల్లా దుర్గయ్య, దాశరథి, సినారె, శేషేంద్రశర్మ, పోరంకి, దేవులపల్లి, గజ్జెల మల్లారెడ్డి, కాళోజీ, శతావధాని కృష్ణమాచార్య, పివి నరసింహారావు, చొక్కారావు ఆదిగా తమ సంస్థ ద్వారా సన్మానితుల గావించారు. సినారె సహకారంతో కరీంనగర్ జిల్లా రచయితల భవనం, సారస్వత జ్యోతి మండలి భవనం నిర్మించారు. చరిత్ర పరిశోధనలోనూ ఆయన ఆసక్తి విశేషం. ధూపాటి వెంకటరమణా చార్యులు, బిఎన్ శాస్త్రిలతో కలిసి కరీంనగర్ ప్రాంత చరిత్ర, శాసనాలపై పరిశోధన చేశారు. పురావస్తు వస్తువులు, తాళపత్రాలు, రాతి శాసనాలు సేకరించి వాటిని సంరక్షించారు. జిల్లా చరిత్ర, దేవాలయాలు, స్వాతంత్ర్య సంగ్రామం నాటి అనుభవాలు వంటి వ్యాస సంకలనాలు, ఆంధ్ర మహాసభలు నిర్వహణ పుస్తకం, గేయాలు వంటి రచనలు వెలువరించారు. ఆయన చేసిన కృషికి అనేక పురస్కారాలు లభించాయి. 2001లో భారతమాత పురస్కారం, లైఫ్ అఛీవ్‌మెంట్ అవార్డు, బంగారు కంకణం పొందారు. గాంధీ మనుమరాలు చేతులమీదుగా లక్షరూపాయల నగదు అందుకున్నారు. గ్రంథాలయ విభూషణ్, ఉపన్యాస కేసరి, హరిజన బంధు, అపరగాంధీ వంటి బిరుదులతో సత్కరింపబడ్డారు. 2005లో కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ బిరుదు ప్రదానం చేసింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన స్వాతంత్ర్య సమరయోధుల ఎంపిక కమిటీ రాష్ట్రాధ్యక్షుడిగా, జాతీయ కమిటీ సభ్యునిగా సేవలందించారు. 2014 అక్టోబర్ 27న 93 ఏళ్ల వయసులో ఆయన కన్నుమూశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సహా పలువురు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. రాజేంద్రప్రసాద్, నెహ్రూ, శాస్త్రి, ఇందిరా గాంధీ, వినోబాభావే, జయప్రకాశ్ నారాయణ్ వంటి మహనీయులతో కలసి పనిచేసిన బోయినిపెల్లి వెంకట రామారావు కరీంనగర్ గాంధీగా చిరస్మరణీయులయ్యారు. ఆయన జీవితం గాంధేయవాదం, సమాజసేవ, సాహిత్యాభివృద్ధి, చరిత్ర సంరక్షణలతో సమన్వయమైన ఒక గొప్ప యుగప్రస్థానం. నిజంగా ఆయన పేరు తెలంగాణ ప్రజా చరిత్రలో అజరామరంగా నిలిచిపోయింది.

# యూరియా యుద్ధం వెనుక అసలు రహస్యం



హైదరాబాద్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై యాభై శాతం సుంకాల మోత మోగించడానికి యూఎస్ వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ బార్లా తలుపులు తెరవడం కూడా ఒక కారణం. అంత అవసరం ఏమొచ్చిందని చూస్తే.. అమెరికా రైతాంగం ఓటు బ్యాంకును ఆకట్టుకోడానికే ట్రంప్ ఇదంతా చేస్తున్నారని అంటారు నిపుణులు. దీని వల్ల వచ్చే లాభనష్టాలేంటి? ఆయన మూడో సారి అధ్యక్షుడయ్యేదుందా? అన్న ప్రశ్న వినిపించవచ్చు. కానీ, వారి దృష్టిలో కూడా తాను గొప్ప రైతు పక్షపాతినని ఎస్టాబ్లిష్ చేసుకోడానికే ట్రంప్ ఇదంతా చేస్తున్నట్టు అంటారు. సరే అమెరికా సంగతి వదిలి పెట్టి తెలంగాణకు వద్దాం. ఇక్కడ మొన్న కేటీఆర్ ఒక కామెంట్ చేశారు. ఎవరైతే తెలంగాణ రైతాంగానికి యూరియా కొరత లేకుండా చేస్తారో వారి ఉపరాష్ట్రపతి అభ్యర్థికే తమ పార్టీ ఎంపీలు ఓటు వేస్తారని చెప్పారు. ఇక్కడా అదే లాజిక్.. ఎలాగైనా సరే, తెలంగాణ రైతాంగం దృష్టినాకర్షించడమే లక్ష్యం. కట్ చేస్తే.. ఇదే బీఆర్ఎస్ ఒక పక్క కాళేశ్వరంపై అసెంబ్లీలో చర్చ అనగా.. తమ పార్టీ వారి చేత రోడ్డుపై యూరియా నిరసనకు తెరలేపింది. ఇక కాంగ్రెస్ తరఫు నుంచి యూరియా యుద్ధం ఎలా సాగిందో చూస్తే.. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలందరూ పార్లమెంటు ఎదుట యూరియా కోసం నిరసన తెలపగా.. ఆ పార్టీ అగ్రనేత ప్రియాంక సైతం వారి ఫ్లెక్సీలను చేపట్టడానికి చేతులు కలిపారు. వియ్ వాంట్ యూరియా అంటూ స్లోగన్ కొట్టారు. దీంతో బీజేపీ యాభై వేల టన్నుల యూరియా తెలంగాణకు పంపుతామని అనడంతో.. ఆ ఘనత మొత్తం తమదేనంటూ ఇక్కడి వ్యవసాయ మంత్రి తుమ్మల కామెంట్ చేసిన విధమూ కనిపించింది. ఈ విషయంలో బీజేపీ వాయిస్ ఎలా ఉందో చూస్తే.. యూరియాకి సంబంధించి తప్పుడు లెక్కలు చూపుతోంది రేవంత్ సర్కార్ అంటూ ఆరోపించారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటివరకు 6.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాని కేంద్ర ప్రభుత్వం అందజేసిందని ఆ గణాంకాలన్నిటినీ విడమరచి చెప్పారాయన. ఇంకా ఎంత యూరియా కావాలంటే అంత ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కూడా అన్నారు. రబీ సీజన్ 2024-2025లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని... కానీ తెలంగాణలో 12.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఆ లెక్కలన్నీ వల్లెవేశారు. కానీ ఇక్కడ చూస్తే యూరియా లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని.. రబీలో అదనంగా ఉన్న యూరియా ఇప్పుడు ఎందుకు లేకుండా పోయిందని.. నిలదీశారాయన. ఎందుకు కొరత వచ్చిందో రేవంత్ ప్రభుత్వం పరిశీలించుకోవాలని సూచించారు తెలంగాణ బీజేపీ చీఫ్ రామచంద్రరావు. రాజకీయాల కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని కూడా ధ్వజమెత్తారు. తాను చెప్పింది తప్పయితే పదవికి రాజీనామా చేస్తానని.. మీది తప్పు అయితే మీరు రాజీనామా చేస్తారా? అని తుమ్మలకు సవాల్ చేశారు తెలంగాణ బీజేపీ చీఫ్. ఇంతకీ తెలంగాణలో వచ్చిన యూరియా కొరత నిజమైనదా? లేక రాజకీయ ప్రేరేపితమా? అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. బేసిగ్గా యూరియా ఎవరి చేతుల్లో ఉంటుందో చూస్తే.. అది కేంద్రం చేతుల్లో. కేంద్రం నుంచి సరఫరా లేక పోవడం వల్లే ఇదంతా అని కాంగ్రెటస్ అంటుంటే.. అలాంటిదేం లేదని బీజేపీ వాదిస్తోంది. అసలు యూరియా కొరత ఎందుకు వచ్చింది? యూరియా కోసం రైతులు ఎందుకు ఇంతలా ఇబ్బందులు పడుతున్నారు? అని చూస్తే వర్షాకాలంలో వరి, పత్తి పంటలకు యూరియా అవసరం పెద్ద మొత్తంలో ఉంటుంది. 2025 సీజన్‌లో ఒక్క తెలంగాణలోనే 1.32 కోట్ల ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగవుతాయని అంటోంది వ్యవసాయ శాఖ. ఇందులో ఆహార ధాన్యాలు 76.14 లక్షల ఎకరాల్లో సాగవుతుండగా.. వీటిలో 62.47 లక్షల ఎకరాల్లో వరి, 48.93 లక్షల ఎకరాల్లో పత్తి, 6.69 లక్షల ఎకరాల్లో కంది, 5.21 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటలున్నాయి. మిగిలిన విస్తీర్ణంలో ఇతర ఆహార, వాణిజ్య పంటలున్నాయి. సీజన్ మొదట్లో ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, మహబూబ్ నగర్ వంటి జిల్లాల్లో అక్కడక్కడ యూరియా కొరత కనిపించింది. వర్షాలు పడి రైతులు పూర్తి స్థాయి సాగుకు సిద్ధపడ్డారు. ఈ లోగా వీరినెత్తిన పిడుగులా వచ్చి పడింది యూరియా కొరత. 2 వేల బస్తాలు అవసరం ఉన్న చోట కేవలం 500 బస్తాలు మాత్రమే వస్తున్నాయ్. ఏ మాత్రం ఆలస్యం అయినా ఆ ఒకటీ అరా బస్తాలు కూడా దొరకవు. దీంతో వర్షం పడుతున్నా కూడా.. క్యూలైన్లు వదలకుండా బారులు దీరుతోంది రైతాంగం. తెలంగాణకు ఎంత యూరియా రావాలి.. ఎంత వచ్చింది? అని చూస్తే.. తెలంగాణకు ఈ వర్షాకాలం సీజన్లో 9.80 లక్షల టన్నుల యూరియా అవసరమని అంచనా వేసింది వ్యవసాయ శాఖ. మాములుగా అయితే ఏటా ఏప్రిల్ నుంచి యూరియా అవసరం మొదలవుతుంది. తర్వాతి సీజన్‌కు తగ్గట్టుగా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుంది. అయితే, 2022 నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ వార్షిక ప్రణాళిక విడుదల చేయడంలేదని ఆరోపిస్తున్నారు రైతు సంఘం నాయకులు. పంటల వారీగా వ్యవసాయ ప్రణాళిక వేయాలని ఎన్నోసార్లు అడిగామనీ.. దీన్నిబట్టి ఎరువులను డిమాండుకు తగ్గట్టుగా ఏర్పాటు చేసుకునే వీలుంటుందనీ.. అదే జరగడం లేదనీ ఆరోపిస్తారు వీరంతా. రాష్ట్ర వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం, తెలంగాణలో ఏప్రిల్ నాటికి 1.92 లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఇది కాకుండా తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారం కేంద్రం నుంచి వచ్చే నెలవారీ యూరియా కోటాలోనూ కోత పడినట్టు తెలుస్తోంది. ఏప్రిల్ నుంచి ఆగస్టు నాటికి కేంద్రం నుంచి 8.30 లక్షల టన్నులకుగాను 5.12 లక్షల టన్నుల యూరియానే వచ్చినట్లుగా చెబుతారు మంత్రి తుమ్మల. ఇదే కాకుండా ఏప్రిల్ నాటికి ఉన్న నిల్వలు కలుపుకొంటే 7.04 లక్షల టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారాయన. కేంద్రం నుంచి రావాల్సిన కేటాయింపుల్లో కోత కారణంగా మొత్తంగా 2.76 లక్షల టన్నుల కొరత ఏర్పడిందని చెబుతారు మంత్రి తుమ్మల. ఈ ఆరోపణలను ఖండించారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచంద్రరావు. యూరియా సరఫరాలో ఎక్కడా కేంద్రం నుంచి లోపం జరగలేదని అంటారు. కేంద్ర ప్రభుత్వం 2025 యాసంగి సీజన్ లో తెలంగాణకు అవసరమైన 9.87 లక్షల టన్నుల యూరియా స్థానంలో 12.47 లక్షల టన్నులు సరఫరా చేసిందని వివరించారు రామచంద్రరావు. ఓపెనింగ్ స్టాక్ లెక్కల్లో తేడాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు. బీఆర్ఎస్ ఈ విషయంలో ఎలాంటి వాదన వినిపిస్తుందో చూస్తే.. తమ హయాంలో ఆరు నెలల ముందు నుంచే ఎరువుల కోసం ముందస్తు ప్రణాళిక తయారు చేసి తెప్పించామని అంటారు కేటీఆర్. ప్రణాళికా లోపం కారణంగానే సమస్య ఏర్పడిందని తేల్చి చెబుతారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. ఎరువుల కొరతపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా డిమాండ్ చేశారాయన. అయితే, రాష్ట్రానికి అవసరమైన ఎరువుల వివరాలు కేంద్రానికి ముందుగా ఇండెంట్ పంపించామని అంటారు మంత్రి తుమ్మల. ఎరువుల పరంగా ఏ రాష్ట్రానికి ఎంత కావాలనే విషయంపై ఆయా రాష్ట్రాల నుంచి డిమాండ్ వెళుతుంది. ఈ ఇండెంట్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఒక ప్రణాళిక రచించి, ఎరువులు సరఫరా చేస్తుంది. బేసిగ్గా అయితే జిల్లాల అవసరాలను బట్టీ ఎరువులను పంపే బాధ్యత వ్యవసాయ శాఖపై ఉంటుంది. కానీ మంత్రులు ఎమ్మెల్యేల బలాబలాలను బట్టీ ఎరువులను తరలిస్తున్నట్టు ఆరోపిస్తున్నారు వ్యవసాయ సంఘం నేతలు. మొత్తంగా డిమాండ్- కేటాయింపులు- సరఫరా మధ్య 2.76 లక్షల టన్నుల వ్యత్యాసం ఏర్పడింది. దీన్ని అధిగమిస్తేనే, రైతులకు సరిపడా యూరియా అందించే వీలుంటుందని అంటారు నిపుణులు. ఇక రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ వ్యవహారం విషయానికి వస్తే.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 145 పని దినాలు ఉంటే 78 రోజులు ఉత్పత్తి నిలిచిపోయిందని ప్రకటించింది రేవంత్ సర్కార్. ఇందుకు సాంకేతిక కారణాలు, అమ్మోనియం లీకేజీ కారణంగా చెబుతోంది ఫ్యాక్టరీ యాజమాన్యం. ఈ ప్రభావం కూడా తెలంగాణ రైతాంగం పడుతున్నట్టు చెబుతున్నారు. బేసిగ్గా రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తయ్యే యూరియాలో 11శాతం వాటా రాష్ట్రానికి ఉంటుంది.

# వినాశకాలే ట్రంప్ విపరీత బుద్ధి!



వాషింగ్టన్,తాచెడ్డ కోతి వనమెల్లా చెరిచిందనే సామెత అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ విషయంలో రుజువైంది. రష్యానుంచి భారత్ చమురును భారీయెత్తున కొనుగోలు చేస్తోందనే సాకుతో యాభై శాతానికి పైగా సుంకాలు విధించిన ఈ మహానుభావుడు, అది చాలదన్నట్లు భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలంటూ ఐరోపా దేశాలకు పిలుపునివ్వడం తెంపరితనం కాక మరేమిటి? తమ మాదిరే భారత్‌పై ఆంక్షలు విధించాలన్న విజ్ఞప్తికి ఆయా దేశాలనుంచి స్పందన లేకపోవడం ట్రంప్‌కు ఒక విధంగా చెంపపెట్టే! ఆసియాలో భారత్‌తో కోరి విరోధం తెచ్చుకుంటే తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్నట్లు అవుతుందనే వాస్తవం ఐరోపా దేశాలకు తెలుసు కాబట్టే ట్రంప్ మాదిరి దూకుడుగా నిర్ణయం తీసుకోకుండా విజ్ఞతతో వ్యవహరిస్తున్నాయి. వాస్తవానికి, రష్యానుంచి భారీయెత్తున చమురు కొనుగోలు చేస్తున్న దేశాలలో అగ్రస్థానం చైనాది. రష్యా మొత్తం క్రూడాయిల్ ఎగుమతుల్లో చైనా కొనుగోళ్లు 47 శాతానికి పైమాటే. ఈ జాబితాలో భారత్ 38 శాతంతో రెండోస్థానంలో ఉంది. ఇలా చూస్తే, చమురు కొనుగోళ్ల ద్వారా రష్యా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న దేశాలలో ప్రథమ స్థానం చైనాదే అయినా ఆ దేశంపై ఆంక్షలు విధించకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక అమెరికా లెక్కలు వేరు. రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, దానిని శుద్ధి చేసి, ప్రపంచ మార్కెట్లో విక్రయిస్తోంది. ఈ చమురును కొనుగోలు చేస్తున్నవాటిలో ఐరోపా దేశాలు కూడా ఉండటమే ట్రంప్ ముందరి కాళ్లకు బంధం వేస్తోంది. చైనాపై అధిక సుంకాలు విధిస్తే, ప్రపంచ చమురు మార్కెట్ అతలాకుతలమవుతుంది. ఆ ప్రభావం ఐరోపాతో సహా అన్ని దేశాల మీదా పడుతుంది. మరో సంగతి ఏమిటంటే, ఐరోపాకు చెందిన కొన్ని దేశాలు కూడా రష్యానుంచి చమురును కొనుగోలు చేస్తున్నాయి. మాస్కో ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కాకుండా చమురు కొనుగోళ్లకు అడ్డుకట్ట వేయాలని, ఉక్రెయిన్ యుద్ధానికి చరమగీతం పాడాలనే చిత్తశుద్ధి ఉంటే ఒక్క భారత్‌ను మాత్రం అదుపులో పెట్టాలనుకోవడం వల్ల ఒరిగేదేం ఉండదు. చైనాతో పోలిస్తే భారతీయ ఎగుమతుల విలువ చాలా స్వల్పం. కాబట్టి ఆంక్షలు విధించడం ద్వారా భారత్‌ను ఇట్టే దారికి తెచ్చుకోవచ్చునన్న ట్రంప్ అంచనాలు పురిట్లోనే సంధికొట్టాయి. పైపెచ్చు, ఈ వివాదం భారతదేశ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా మారింది. అదే సమయంలో భారత్‌కు చైనా స్నేహహస్తం అందించడంతో ఒక్కసారిగా దౌత్యసంబంధాలలో కొంగొత్త మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటికే బ్రిక్స్ సభ్యత్వ దేశాల మధ్య చివుళ్లు వేస్తున్న స్నేహబంధం ట్రంప్ పుణ్యమాని మరింత బలోపేతమైంది. చైనా, రష్యా, భారత్ చేతులు కలపడం, తాజాగా తియాన్ జిన్ నగరంలో షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు వేదికగా మోడీ, షీ జిన్‌పింగ్, పుతిన్ వాణిజ్య, దౌత్య సంబంధాల బలోపేతం విషయమై చర్చలు సాగించడం అమెరికాకు సుతరామూ ఇచ్చగించదనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో బ్రిక్స్ దేశాలపై ట్రంప్ ఆంక్షల కొరడా ఝళిపించినాఆశ్చర్యపోనక్కరలేదు. ఇప్పటికే బ్రిక్స్ సభ్యత్వ దేశాలైన ఇండియా, బ్రెజిల్ పై చెరో 50 శాతం చొప్పున, చైనా, దక్షిణాఫ్రికాపై చెరో 30 శాతం చొప్పున సుంకాలు విధిస్తున్న అమెరికా, తియాన్ జిన్‌లో చోటు చేసుకునే పరిణామాలను బట్టి ఇతర దేశాలపైనా సుంకాలు పెంచే అవకాశం లేకపోలేదు. పాశ్చాత్య దేశాల ఆధిపత్యానికి తెర దించేందుకు ఏర్పడిన కూటమిగా భావిస్తున్న ట్రంప్, ఇదివరకే బ్రిక్స్ దేశాలపై అదనపు సుంకాలు విధిస్తానంటూ హెచ్చరించిన సంగతి తెలిసిందే. తన అర్థం పర్థం లేని విధానాలతో స్నేహితులను కూడా శత్రువులను చేసుకుంటున్న ట్రంప్, జరగబోయే అనర్థాలను ఊహించలేకపోతున్నారు. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అంటూ నినదించి, అమెరికన్లకు అరచేతిలో వైకుంఠం చూపించి పదవిలోకి వచ్చిన ట్రంప్, వాస్తవానికి అమెరికాను అగ్రస్థానంలో నిలబెట్టడం అటుంచి, ఆ దేశ పరువును బజారుకీడుస్తున్నారు. ట్రంప్ లోపభూయిష్టమైన విధానాల కారణంగా బ్రిక్స్ మరింత బలోపేతమైతే, అది అమెరికా అభివృద్ధికి పెనుసవాలుగా మారుతుందని ఇప్పటికే పలువురు ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డాలర్‌పై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ కరెన్సీని ఏర్పాటు చేసుకోవాలన్నది బ్రిక్స్ దేశాల అభిమతం. ఇప్పటివరకూ ఉప్పునిప్పూలా ఉన్న చైనా, భారత్ తాజాగా చేతులు కలిపిన నేపథ్యంలో బ్రిక్స్ ఆశయం నెరవేరితే అమెరికా తాను తీసుకున్న గోతిలో తానే పడటం ఖాయం.

# ఉత్తరాదిలో వర్ష బీభత్సం

న్యూఢిల్లీ,ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు ప్రమాదకర స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. యమునా ఉధృతితో ఢిల్లీ నగరం నీట మునిగింది. ఇప్పటికే ఇళ్లలోకి నీరు చేరుతోంది. ఢిల్లీలోని యమునా నదిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. నదీ ప్రవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో కొండచరియలు విరిగిపడి ఏడుగురు మృతిచెందారు. రాష్ట్రంలో పలుచోట్ల ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సిమ్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి తండ్రీ, కుమార్తె సహా ఐదుగురు మరణించారు. ఉత్తరాఖండ్‌లోని సోన్‌ప్రయాగ్ గౌరీకుండ్ మధ్య ఉన్న కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతిచెందారు. ఆరుగురు గాయపడ్డారు. దీంతో ఈ నెల 3 వరకు కేదార్‌నాథ్ యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఉత్తరకాశీ జిల్లాలోని కమ్లా నదితో పాటు, డేహ్రాడూన్‌లోని శాలినీ నది, తెహ్రీ జిల్లాలోని అగ్లర్ నది, రుద్రప్రయాగ్‌లోని అలకనందా, మందాకిని నదులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. పంజాబ్, హరియాణా, చండీగఢ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. లూథియానాలో అత్యధికంగా 216.70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పఠాన్‌కోట్, గుర్‌దాస్‌పుర్, ఫాజిల్కా, కపూర్థలా, తరన్‌తరన్, ఫిరోజ్‌పుర్, హోశియార్‌పుర్, అమృత్‌సర్ జిల్లాల్లోని పలు గ్రామాలు నీట మునిగాయి. ఈ ఆరు జిల్లాల్లో మంగళవారం వరకూ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీచేసింది. పంజాబ్‌లో వర్షాల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. రాష్ట్రంలోని 793 రోడ్లను మూసి వేశారు. ఈ నెల 3వరకు అన్ని విద్యాసంస్థలను మూసివేయాలని పంజాబ్ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాజస్థాన్ రాజధాని జైపుర్‌తో సహా పలు ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. రాష్ట్రంలో పిడుగుపాటుకు ఇద్దరు మృతిచెందారు. ఒకరు నదీ ప్రవాహంలో కొట్టుకుపోయారు. జమ్మూ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లలో వరదల్లో చిక్కుకొన్న 5 వేల మందిని, 300 మంది పారామిలటరీ దళాల సిబ్బందిని రక్షించామని సైన్యం తెలిపింది. పంజాబ్‌లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర గవర్నర్ గులాబ్ చంద్ కటారియాతో పాటు- ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌తో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి అధికారులతో సమీక్షించారు. వరదల్లో నష్టపోయిన పంజాబ్, జమ్మూకశ్మీర్‌లను కేంద్రం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీఇచ్చారు.

# రాజకీయ సన్యాసం?

అమరావతి,పుంగనూరు ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ సన్యాసం తీసుకోవాలని భావిస్తున్నారా.. ఆ దిశగా ఆయన ఆలోచన చేస్తున్నారా.. అంటే వైసిపి వర్గాల్లో అవునని సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పెద్దిరెడ్డి కుటుంబం చుట్టూ అనేక కేసులు చుట్టుముట్టాయి. ఆయన కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి ప్రస్తుతం జైల్లో ఉన్నారు. తాజాగా పెద్దిరెడ్డి ఫ్యామిలీకి సంబంధించిన డీకేటీ భూముల విషయంపై ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ భూముల రిజిస్ట్రేషన్ ను రద్దుచేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ ప్రభావం కూడా పెద్దిరెడ్డి పై ఎక్కువగా పడుతోంది. మరోవైపు వైసీపీ వైపు నుంచి తాను అనుకున్న స్థాయిలో మద్దతు లభించడం లేదన్నది పెద్దిరెడ్డి అనుచరుల వద్ద చెబుతున్న మాట. రాజంపేట ఎంపీ అరెస్టు అయిన తర్వాత ఇప్పటివరకు వైసీపీ అధినేత జగన్.. పెద్దిరెడ్డి ఫ్యామిలీని పరామర్శించింది లేదు. మరి దీని వెనక ఏం జరుగుతోందన్నది లేకపోయినా.. అంతర్గతంగా మాత్రం జగన్ తమ కుటుంబాన్ని పట్టించుకోవడంలేదని ఇలా అయితే ఇక పార్టీలో ఉండి ప్రయోజనం వెంటనే పెద్దిరెడ్డి భావిస్తున్నారు. అసలు రాజకీయాలే తనకు అవసరం లేదనే పెద్దిరెడ్డి వాపోయినట్టు వైసిపి వర్గాల్లో చర్చ జరుగుతోంది. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉన్న పెద్దిరెడ్డి పుంగనూరు నియోజకవర్గంలో గత ఎడాది కూటమి ప్రభావాన్ని సైతం తట్టుకొని అనేక ఇబ్బందులను ఓర్చుకొని మరీ విజయం దక్కించుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా చేశారు. గతంలో కూడా ఆయన మంత్రి పదవులు అలంకరించారు. కానీ, ఇప్పుడు మాత్రం తీవ్ర ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒకవైపు కుటుంబాన్ని కాపాడుకోవడం, మరోవైపు కేసుల నుంచి రక్షించుకోవడం అనేది పెద్దిరెడ్డికి ఈ వయసులో పెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం రాజకీయాల నుంచి బయటకు వచ్చేస్తే ఈ కేసులు భారం కొంతవరకు తగ్గుతుంది అన్నది ఆయన ఆలోచనగా ఉందని కొందరు నాయకులు భావిస్తున్నారు. ఈ కారణంగానే రాజకీయ సన్యాసం తీసుకుంటారా అనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం మదనపల్లిలో జరిగిన ఫైళ్ల అగ్నిప్రమాదం కేసు నుంచి అంగళ్లు సెంటర్లో జరిగిన చంద్రబాబుపై రాళ్ల దాడి ఘటన వరకు అనేక కేసులు పెండింగ్లో ఉన్నాయి. వీటిని తిరిగి తోడాలి అనేది ప్రస్తుతం ప్రభుత్వం ఆలోచనగా ఉంది. మరోవైపు లిక్కర్ కుంభకోణం కేసు ఎప్పటికీ తేలుతుందో తెలియదు. ఇక ఎంపీ మిథున్ రెడ్డి ఎప్పుడు బయటకు వస్తారు అనేది కూడా సస్పెన్స్ గానే మారింది. మరోవైపు భూముల కుంభకోణం.. తమ పేరుతో ఉన్న భూములను రద్దు చేయడం వంటివి కూడా పెద్దిరెడ్డి కుటుంబాన్ని తీవ్రస్థాయిలో కుదిపివేస్తున్నాయి. ఈ క్రమంలో తాను రాజకీయాల నుంచి తప్పుపోవడమే బెటర్ అనే ఆలోచనకు వచ్చినట్టు పెద్దిరెడ్డి అనుచరులు మధ్య చర్చ సాగుతున్నట్టు సమాచారం. మరి ఇది ఎంతవరకు నిజం అనేది చూడాలి. రాజకీయాల నుంచి తప్పుకుంటే జగన్ ఏం చేస్తారు? ఆయన ఏమన్నా ఊరడిస్తారా? లేకపోతే మౌనంగా ఉంటారా? అనేది చూడాలి. ఏదేమైనా ప్రస్తుతం వైసీపీలో ఈ విషయం అంతర్గతంగా తీవ్ర చర్చకు దారి తీసింది.

# లండన్ వినాయక నిమజ్జనంలో విషాదం

హైదరాబాద్,లెండన్‌లో జరిగిన వినాయక నిమజ్జనం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. నిమజ్జనానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు హైదరాబాద్ వాసులు మృతిచెందారు. వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా రెండు కార్లు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులను నాదర్‌గుల్‌కు చెందిన తర్రె చైతన్య (23), ఉప్పల్‌కు చెందిన రిషితేజ (21)గా గుర్తించారు. ఈ ఘటనలో మరో ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులంతా తెలుగు రాష్ట్రాలకు చెందినవారిగా గుర్తించారు. నాదర్‌గుల్‌కు చెందిన తర్రె ఐలయ్య, మంగమ్మల చిన్నకుమారుడు చైతన్య. బీటెక్ పూర్తిచేసిన ఆయన.. ఉన్నత చదువుల కోసం 8 నెలల క్రితం లండన్ వెళ్లాడు. వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుని 8 మంది స్నేహితులతో రెండు కార్లలో నిమజ్జనానికి బయల్దేరారు. తిరిగి వస్తున్న సమయంలో వీరి కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చైతన్య, రిషితేజ మృతిచెందారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం రాత్రి కుటుంబసభ్యులకు సమాచారం అందింది. వీరి మృతితో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో చుట్టుపక్కల వారు కూడా కన్నీరు మున్నీరయ్యారు.

## గట్టు పటిష్టతపై అధికారులతో ఆరా

ఏలూరు, తమ్మిలేరు వరద దృష్ట్యా ఏలూరు రూరల్ ,అర్బన్ ప్రాంతంలోని లోతట్టు- ప్రాంతాలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ,జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ లు ఇతర సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం ఉదయం పరిశీలించారు. నగరంలోని తమ్మిలేరు నదీపరివాహక ప్రాంతమైన శనివారపుపేట కాజ్ వే, బాలయోగి వంతెన, తంగెళ్ళమూడి. వంతెన తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తమ్మిలేరు వరద మూలంగా సంబంధిత పరివాహక ప్రజలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవలసిన చర్యలు, తమ్మిలేరు వెంట ఉన్న గట్ల పటిష్టతను గురించి క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను వారు ప్రత్యక్షంగా తెలుసుకొనీ అధికారులకు పలు ఆదేశాలు సూచనలను జారీచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఇటీ-వల కురిసిన భారీ వర్షాల కారణంగా తమ్మిలేరు, ఎర్రకాల్వ, గోదావరి తీర ప్రాంతాలకు, కొల్లేరు వరద ప్రభావానికి గురయ్యాయని, వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎటు-వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులను, ప్రజలను అప్రమత్తం చేసిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించడం జరిగిందన్నారు. జిల్లాలో గత మూడు రోజుల నుండి 89 మిల్లీమీటర్ల వర్షం కారణంగా నాగిరెడ్డిగూడెం వద్ద నీటిని విడుదల చేయడంతో తమ్మిలేరు పొంగి ప్రవహిస్తున్నదన్నారు. జిల్లాలో తమ్మిలేరు వరద కారణంగా చింతలపూడి, లింగపాలెం,పెదవేగి, చాట్రాయి, ముసునూరు మండలాలలోని గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఎర్రకాల్వ వరద కారణంగా జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం లో వరద పరిస్థితులు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని డివిజన్ కేంద్రాలలో లైఫ్ జాకెట్లు-, రోప్ లు వంటివి సిద్ధం చేయడం జరిగిందని, ప్రజలెవ్వరూ వరద ఉధృతి పరిస్థితులకు వద్దకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కొల్లేరు లంక గ్రామాలలో బోట్లలో ప్రయాణించవద్దని, ఈ విషయాన్నీ ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు టాంటాం ద్వారా తెలియజేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. భద్రాచలం వద్ద గోదావరి వరద నీటి మట్టం రెండవ ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరి, తగ్గుముఖం పట్టి, ప్రస్తుతం 41 అడుగుల వద్ద ఉందన్నారు. గోదావరి వరద ముంపు ప్రాంతంలోని ప్రజలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, పాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో వరద పరిస్థితులు తగ్గుముఖం పెట్టేవరకు ప్రజలు, అధికారులు అప్రమత్తంతో ఉండాలని కలెక్టర్ చెప్పారు. గతం లాగా వరద వస్తే అందుకు తగిన విధంగా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు- సిద్ధం చేసుకోవాలన్నారు. గట్ల పటిష్టతను పరిశీలించి బలహీనమైన చోట్ల అవసరమైన ఇసుక బస్తాలు, తదితర సామాగ్రితో పటిష్టం చేయాలన్నారు. అత్యవసర పరిస్థితిలో ఎక్కడైనా వరద ప్రవాహానికి గండి కొట్టవలసిన పరిస్థితి ఉంటే అందుకు అవసరమైన ప్రో-ల్గ÷కె-నర్ ముందుగానే అందుబాటు- లోకి తెచ్చుకోవాలని, ముంపు ప్రమాదం ఏర్పడే వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. .అదేవిధంగా ఆటో ద్వారా మైక్ ద్వారా కూడా సమాచారం ముందుగానే తెలియజేయాలన్నారు. గతంలో తమ్మిలేరు వరదలను దృష్టిలో పెట్టు-కొని చర్యలు చేపట్టాలని తెలిపారు. తమ్మిలేరు రిజర్వాయర్ లో నీటిసామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులు తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తమ్మిలేరు కాలువకు సంబంధించి ఏలూరులో నాలుగు పాయింట్లు- వద్ద సంబంధిత అధికారులు 24 గంటలు పర్యవేక్షణలో ఉండి, ప్రజలెవ్వరూ వరదనీటిలో దాటకుండా చూడాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడానికి ముందుగానే హెచ్చరికలను జారీచేయవల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ఇరిగేషన్ ఇంజనీర్లు తో పాటు- నగరపాలక సంస్థ ఇంజనీర్లను ఆయా 4 పాయింట్లు-లో సిబ్బందిని పర్యవేక్షణకు ఉంచాలన్నారు. సంబంధిత అధికారులు పేర్లు,ఫోన్ నెంబర్ల తో సహా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. వరద ప్రభావం దృష్టిలో ఉంచుకుని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ మాట్లాడుతూ నాగిరెడ్డి గూడెం వద్ద తమ్మిలేరు వరద నీటి విడుదల ఎపటికప్పుడు రెవెన్యూ పోలీసు అధికారులతో పాటు- ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. అదే సమయంలో ఆటో ద్వారా మైక్ లో వరద ప్రమాద హెచ్చరికలను ఆయా ప్రాంత వాసులకు తెలీజేయాలన్నారు. తమ్మిలేరు వరదకు సంబంధించి గతంలో సంభవించిన వరదలు, నీటి ప్రవాహాన్ని నిరోధించేందుకు గండ్లు ఏ ప్రాంతంలో చేసింది తదితర వివరాలను ఆయన ఆరా తీశారు.వీరి వెంట ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, డిఎస్పీ శ్రవణకుమార్,ఇరిగేషన్ ఎస్ఈ సి హెచ్ దేవప్రకాష్,,నగరపాలక సంస్థ కమిషనరు భానుప్రతాప్, ఏలూరు తహశీల్దారు గాయత్రి తదితరులున్నారు.

## బీజేపీకి మోతెక్కేలా !

న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అయిన రాహుల్ గాంధీ బీజేపీని టార్గెట్ గా చేసుకుని బీహార్ లో ఓటర్ అధికార యాత్రను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జరిగిన ఒక ర్యాలీలో ఆయన కేంద్ర ప్రభుత్వం మీద బీజేపీ మీద తీవ్ర వ్యాఖ్యలు చేసారు. తన చేతిలో హైడ్రోజన్ బాంబు ఉందని దానిని త్వరలో వేస్తాను అని భారీ వార్నింగ్ ఇచ్చేశారు. ఆ బాంబుతో ప్రకంపనలు పుడతాయని ఆయన అంటున్నారు

ఓటు చోరీ అంటూ రెట్టిస్తున్నా :

రాహుల్ గాంధీకి ఏమీ తెలియదు పప్పు అని బీజేపీ వారు అంతా ఒక అభిప్రాయం పక్కాగా స్థిరపరచుకున్నారు. అయితే అది తప్పు తాను పప్పుని కాదు అని రాహుల్ చాలా కాలం క్రితమే రుజువు చేసుకున్నారు ఆయన నిప్పు కణికగా మారిపోతారని ఎవరూ అనుకోలేదు. కానీ ఆయన నిప్పులే రాలుస్తున్నారు ఓటు చోరీ అంటూ రాహుల్ వాడుతున్న పదాలు కానీ ఆయన చేస్తున్న ర్యాగింగ్ కానీ అసలు ఏ మాత్రం తట్టుకోలేకపోయేలా కాషాయం పెద్దలకు ఉందని అంటున్నారు వారి చేతనే కషాయం తాగించేస్తున్నారు అని కూడా సెటైర్లు పడుతున్నాయి.

హైడ్రోజన్ బాంబు వేస్తా :

ఇదిలా ఉంటే బీహార్ ర్యాలీలో రాహుల్ స్ట్రాంగ్ బీజేపీకి బిగ్ వార్నింగ్ ఇచ్చారు.ఓటు చోరీ దేశవ్యాప్తంగా జరిగింది అని రాహుల్ గాంధీ రెట్టిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఎన్నో విధాలుగా సాయపడుతోందని ఈ క్రమంలో సామాన్యులు బడుగుల ఓట్లు చోరీ అవుతున్నాయని ఆయన అంటున్నారు. ఆగస్టు నెల 17 నుంచి ఆయన ఓటర్ అధికార యాత్ర చేస్తూ ప్రతీ చోటా ఇదే విషయం చెబుతున్నారు. ఈ ర్యాలీలో అయితే ముందుంది చాలా అంటున్నారు. అదేంటి అంటే హైడ్రోజన్ బాంబు వేస్తాను అని హెచ్చరిస్తున్నారు.

లోక్ సభ ఎన్నికల గురించేనా :

ఇక లోక్ సభ ఎన్నికలలోనూ పెద్ద ఎత్తున ఓట్ల తారు మారు జరిగింది అని రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. వాటి వివరాలు అన్నీ కూడా పక్కాగా తన దగ్గర ఉన్నాయని అవి అణు బాంబు కంటే పవర్ ఫుల్ అని కూడా చెబుతున్నారు. చాలా తొందరలోనే వాటిని బయటపెడతాను అని అంటున్నారు. అంటే ఆగస్ట్ 7న ఆయన వేసిన తొలి బాంబు ఎఫెక్ట్ బీహార్ అంతా ర్యాలీగా మారి ఒక ఊపు ఊపేసింది. ఇపుడు ఏకంగా హైడ్రోజన్ బాంబు అని అంటున్నారు. ఇది ఏ రకమైన రాజకీయ దుమారం రేపుతుందో అన్న చర్చ అయితే ఉంది అని అంటున్నారు.

# చొరబాట్ల పేరిట ప్రజాస్వామ్యానికి తూట్లు



న్యూఢిల్లీ,కేంద్ర హెూం మంత్రి అమిత్ షా గౌహతీలో మాట్లాడుతూ, చొరబాటు దారులను రక్షించేవారు అసోంను పాలించలేరని విలక్షణమైన ప్రకటన చేశారు. రాహుల్ గాంధీ ఓట్ అధికార యాత్రను ఘుసోటియా అధికార యాత్రగా పేరు మార్చాలంటూ ఎద్దేవా చేశారు. ఆ ప్రకటన పార్టీ వర్గాల నుంచి హర్షధ్వానాలు తెచ్చిపెట్టవచ్చు. కానీ అది ఆయన హిపోక్రసీ తప్ప మరేమీ కాదు. చొరబాటు అనే పదాన్ని అధికార రాజకీయాలకు ఒక సాధనంగా మార్చిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీయే. దశాబ్దాలుగా అక్రమ వలసల సమస్య అసోంను కుదిపివేస్తున్నది. ఆరేళ్లపాటు జరిగిన అసోం ఆందోళన 1995 అసోం ఒప్పందంతో ముగిసింది. ఇది రాష్ట్ర జనాభా సమతుల్యతను కాపాడేందుకు ఇచ్చిన ఓ గొప్ప హామీ పత్రం. దాని ప్రధాన నిబంధన సుస్పష్టంగా ఉంది.1971 మార్చి 25 తర్వాత బంగ్లాదేశ్ నుంచి అసోంలోకి ప్రవేశించిన వారందరినీ, వారి మతంతో సంబంధం లేకుండా బహిష్కరించాలన్నదే ప్రధాన నిబంధన. అధికారంలో ఉన్న ఏ పారీకీ ఆ నిబంధనను నీరుగార్చే నైతిక హక్కు లేదు. అయినా, ఒప్పందాన్ని అక్షరాలా పూర్తి స్ఫూర్తితో అమలు చేస్తామని హామీతో అసోంలో అధికారంలోకి వచ్చిన బిజెపి పూర్తిగా అందుకు విరుద్ధంగా చేసింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిర్వహించిన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్సి) కసరత్తు పౌరసత్వం ప్రశ్నకు చివరి జవాబుగా ప్రచారం జరిగింది. చాలా ఏళ్ల కసరత్తు తర్వాత తుది జాబితానుంచి దాదాపు 19 లక్షల మంది పేర్లు తొలగించబడ్డాయి. వీరిలో బంగ్లాదేశ్ నుంచి సరిహద్దు దాటి భారతదేశంలోకి వచ్చిన హిందువులే ఎక్కువ.బిజెపికి ఇది రాజకీయంగా అసౌకర్యంగా ఉంది. బిజెపి ఎల్లప్పుడూ ముస్లింలను చొరబాటుదారులుగా, హిందువులను శరణార్థులుగా చిత్రీకరించింది. కానీ ఎన్ఆర్సి వాస్తవికత ఈ అపోహను తుంగలోకి తొక్కింది. దీంతో దీనిని అంగీకరించే బదులు ఆ పార్టీ పౌరసత్వ చట్టాన్ని సవరించేందుకు తొందరపడి, అపఖ్యాతి పాలైన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను తీసుకువచ్చింది. పొరుగుదేశాల నుంచి వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం ఇవ్వడం ద్వారా, అసోం ఒప్పందం ప్రకారం బహిష్కరించాలని డిమాండ్ చేసిన చొరబాటుదారులను కచ్చితంగా చట్టబద్ధం చేసేందుకు బిజెపి ప్రయత్నించింది. ఆరేళ్ల పాటు రూ. 1600 కోట్లు ఖర్చు చేసిన తర్వాత సవరించిన ఎన్ఆర్సిని సవరించాలని బిజెపి పట్టుబట్టింది.ఒకపక్క అమిత్ షా చొరబాటుదారులను రక్షించడం కోసం కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తుండగా, ఆయన పార్టీ ప్రభుత్వం, చట్టం ఆధారంగా కాకుండా, మతపరమైన గుర్తింపు ఆధారంగా ఎంపికచేసి రక్షించడంలో బిజీగా ఉంది. అసోం పోరాటానికి ద్రోహం జరిగింది. తమ భూమిని, సంస్కృతిని కాపాడుకునేందుకు డిమాండ్ చేస్తూ జరిగిన ఆందోళనలో వేలాది మంది అస్సామీ యువకులు ప్రాణాలను అర్పించారు. ఉద్యమానికి నాయకత్వం వహించిన ఆల్ అసోం స్టూడెంట్ యూనియన్ (ఆసు) ఈ ఒప్పందంపై చిత్తశుద్ధితో సంతకం చేసింది. ఈ రోజుకీ ఆసు 1971 తర్వాత వచ్చిన హిందువులు, ముస్లింలు అందరూ అసోం నుంచి తప్పనిసరిగా వెళ్లాలని దృఢంగా చెబుతోంది. కానీ, బిజెపి ఎన్నికల్లో ప్రయోజనం కోసం ఒప్పందాన్ని వాడుకుని, ఆ తర్వాత తన మతపరమైన ఎజెండాకు అనుగుణంగా దానిని పక్కనపెట్టింది. 2016 అసోం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో బిజెపి ఈ ఒప్పందాన్ని అక్షరాలా, పూర్తిగా స్ఫూర్తితో అమలు చేస్తామని వాగ్దానం చేసింది.కానీ, 9 సంవత్సరాల తర్వాత కూడా ఆ ఒప్పందం కాగితాలకే పరిమితమైంది. దానికి బదులుగా విస్తృత మోసం ఆవిష్కృతమైంది. భయాన్ని సృష్టించేందుకు ఓ కమ్యూనిటీని చొరబాటుదార్లుగా ముద్రవేయడం, అదే సమయంలో ఇతరులకు చట్టబద్ధతను కల్పించడం. ఇది పాలన కాదు రాజకీయపరమైన మోసం. అసోంలో ప్రస్తుతం నెలకొన్న కఠినమైన నిజం ఏమిటంటే, చొరబాటుదారులు అనే సాకు బెంగాలీ మాట్లాడే ముస్లింలను బయటి వ్యక్తులుగా చిత్రీకరించడానికి ఓ ఆయుధంగా మారింది. ముస్లింలే లక్ష్యంగా చేసుకుని ప్రచారం సాగిస్తూ, సామూహిక తొలగింపులు ఓటర్ల పేర్ల తొలగింపు ఘుస్పేటియాస్ అనే ముద్రవేసి ప్రచారం నిరంతరం సాగుతోంది. మరీ దారుణం ఏమిటం, ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేద కుటుంబాలను బుల్డోజర్ల ద్వారా వెళ్లగొట్టే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.వారికి పునరావాసం లేకుండా చేసింది. ర్యాలీలలో బిజెపి నాయకులు చొరబాటు దారులను కొట్టడం, దాడి చేయడంతోపాటు, గట్టి గుణపాఠం నేర్పిస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్నారు. అధికార పక్షం అనుమతితోనే జనాల్ని రెచ్చగొట్టే పని సాగుతోంది. ఇంత చేస్తున్నా ఒక్క చొరబాటుదారుడిని కూడా దేశం నుంచి బహిష్కరించలేదు. భారత ప్రభుత్వం బంగ్లాదేశ్‌తో దౌత్యపరమైన ఒప్పందం కోసం కృషి చేయలేదు. బహిష్కరణలను అమలు చేసేందుకు ఓ యంత్రాగాన్ని ఏర్పాటు చేయలేదు. అందుకు కారణం చొరబాటుదారుడు శాశ్వత ఎన్నికల సమయంలో దిష్టబొమ్మలా చాలా ఉపయోగపడుతూ ఉండడమే. లక్షలాది మందికి ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులను జారీ చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఆ పత్రాలను అదే ప్రభుత్వం పౌరసత్వం రుజువుగా అంగీకరించడానికి నిరాకరిస్తోంది.ఇది అనుమానాలకు తావు ఇస్తోంది. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? విశ్వాసంతో ఆ పత్రాలు అంగీకరించిన సామాన్యుడా? వాటిని జారీ చేసిన అధికారులా? పేదలకు ఓటు హక్కు లేకుండా చేస్తూ బిజెపి తన నిజమైన లక్ష్యాన్ని బయటపెట్టింది. సరిహద్దుల భద్రతే కాదు, దానికి మద్దతు ఇవ్వని వర్గాల ఓటరు జాబితాపై కోతపెడుతున్నారు. ఎన్నికల కమిషన్ కూడా ఈ ఆటలో భాగస్వామిగా మారింది. పారదర్శకత లేకుండా పేర్లను కొట్టివేసింది. తటస్థంగా ఉండడానికి బదులు అధికార పార్టీకి పావుగామారి జనాభా గణన అమలు చేసేదిగా కన్పిస్తోంది. అసోం ప్రయోగం ఆ రాష్ట్రానికే పరిమితం కాదు.

# కృత్రిమ మేధతో ఉపాధికి ఊతం

హైదరాబాద్,ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రస్తుతం విరివిగా వినిపిస్తున్న సాంకేతికత. రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతున్నది ఈ రంగం. వ్యాపార, వాణిజ్య, సేవా రంగాల్లో ఈ కృత్రిమ మేధ చాలా ఉపయోగపడుతున్నది. కృత్రిమ మేధ అంటే యంత్రాలు, ముఖ్యంగా కంప్యూటర్ వ్యవస్థల ద్వారా మానవ మేధస్సులో జరిగే ప్రక్రియలను అనుకరించడం. డేటా సేకరణ, డేటా ఎంట్రీ, కస్టమర్ ఫోకస్డ్ బిజినెస్, ఇ- మెయిల్ ప్రతిస్పందనలు, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, ఇన్వాయిస్ జనరేషన్ వంటి యాంత్రికంగా పునరావృతం చేసే రొటీన్ పనులను ఆటోమేషన్ చేసి పనిలో విసుగుదలను తగ్గించి మనిషి మరింత సృజనాత్మకంగా చేసుకోవాల్సిన పనులకు సమయం కల్పిస్తుంది. అనేక మంది మార్కెట్ పరిశోధకులు ఎఐ సమాజంలో అనేక సానుకూల మార్పులను తీసుకువచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉందని, వాటిలో మెరుగైన ఉత్పాదకత, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, విద్యకు ప్రాప్యత పెరగడం వంటివి ఉన్నాయని అంటున్నారు. కానీ మనం ఇప్పుడే దానికి అనుగుణంగా మారాలి.రోబోలు, సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు, స్మార్ట్ అసిస్టెంట్లు, హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, ఆటోమేటెడ్ ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్, వర్చువల్ ట్రావెల్ బుకింగ్ ఏజెంట్, సోషల్ మీడియా మానిటరింగ్, మార్కెటింగ్ చాట్ బోట్స్ వంటి రూపాలలో కృత్రిమ మేధ ఇప్పటికే మన నిత్యజీవితంలోకి ప్రవేశించింది. అది సాంకేతిక అభివృద్ధిలో గుణాత్మకమైన, పరిమాణాత్మకమైన పెద్ద మార్పును సూచిస్తున్నది. మరికొందరు, ఎక్కువగా మానవీయంగా పునరావృతమయ్యే మానవ పని రకాల ఉద్యోగాలలో పనిచేసే వారు, ఎఐ, రోబోటిక్స్ ఒక విధ్వంసకశక్తి అని, ఉద్యోగాల భవిష్యత్తు విషయానికి వస్తే అది ఉద్యోగాలను తగ్గించడానికి మాత్రమే ఉపయోగపడుతుందని చెబుతారు. కానీ రోబోలు, ఎఐ టెక్నాలజీలు చాలా కొత్త వృత్తులను సృష్టించగలవు, సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడంలో సహాయపడతాయి. మన దైనందిన జీవితాలను సులభతరం చేస్తాయి, మరింత సౌకర్యవంతంగా చేస్తాయి. కానీ ఎఐ ప్రతికూల శక్తిగా కాకుండా సానుకూల శక్తిగా ఉండటంవైపు మొగ్గు చూపుతోంది.ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థను ఎఐ ప్రభావితం చేస్తుంది. మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం ప్రపంచ సగటు స్థాయిలో దత్తత, శోషణ, ఎఐ లో పురోగతి వారి అనుకరణ ద్వారా సూచించబడినట్లుగా, భవిష్యత్తులో 2030 నాటికి దాదాపు 13 ట్రిలియన్ డాలర్ల అదనపు ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలను అందించడానికి తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. నేటితో పోలిస్తే దాదాపు 16% అధిక సంచిత జిడిపిని అందిస్తుంది. ఇది సంవత్సరానికి 1.2% అదనపు జిడిపి వృద్ధికి సమానం. ఒకవేళ అమలు చేయబడితే ఈ ప్రభావం చరిత్ర అంతటా ఇతర సాధారణ- ప్రయోజన సాంకేతికతలతో బాగా సరిపోతుంది. ఇది ప్రధానంగా ఆటోమేషన్ ద్వారా శ్రమను భర్తీచేయడం, ఉత్పత్తులు, సేవలలో పెరిగిన ఆవిష్కరణల నుండి వస్తుంది. 2030 నాటికి, సగటు అనుకరణ ప్రకారం 70% కంపెనీలు ఎఐ విప్లవాన్ని స్వీకరించి కనీసం ఒక రకమైన ఎఐ సాంకేతికతను అవలంబిస్తాయని, కానీ సగం కంటే తక్కువ కంపెనీలు ఐదువర్గాలను పూర్తిగా గ్రహించాయని అదే నివేదిక పేర్కొంది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో మనం అభివృద్ధి చేయబోయే అత్యంత విఘాతం కలిగించే సాంకేతిక పరిజ్ఞానాలలో ఎఐ ఒకటిగా ఉండే అవకాశం ఉందని ఫోర్బ్ పేర్కొంది. కృత్రిమమేధ సమాజాన్ని, భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఎఐ భవిష్యత్తు మన జీవితాలను చాలా వరకు సరళీకృతం చేయడానికి సహాయపడే అంతులేని అవకాశాలను, అనువర్తనాలను తీసుకువస్తుందని ఫోర్బ్ చెబుతోంది. ఇది మానవాళి భవిష్యత్తు, విధిని సానుకూలంగా రూపొందించడంలో సహాయపడుతుంది. అయితే బెర్నార్డ్ మార్%డ% కో మన సమాజంపై కృత్రిమ మేధ పరివర్తనాత్మక ప్రభావం వల్ల అన్ని రకాల ఉద్యోగాలు, పరిశ్రమలపై విస్తృత శ్రేణి ఆర్థిక, చట్టపరమైన, రాజకీయ, నియంత్రణ ప్రభావాలను




చూపుతుందని చెబుతోంది. మెరుగైన ఉత్పాదకత, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, విద్యకు ప్రాప్యతను పెంచడం వంటి అనేక సానుకూల మార్పులను ఎఐ ప్రస్తుతం, భవిష్యత్తులో తీసుకురాగల సామర్థ్యాన్ని కలిగి ఉందని ఈ విషయం తెలిసిన ఇతరులు అంటున్నారు.ఎఐ ఆధారిత సాంకేతికతలు సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడంలో సహాయపడతాయి. 2030 నాటికి 20-50 మిలియన్ల కొత్త ఉద్యోగాలు వస్తాయని అంచనా వేయగా ఎఐ ఆరోగ్య సంరక్షణ, ఔషధాలు, ఇతర పరిశ్రమలలో ఉద్యోగాలను సృష్టిస్తోంది. శ్రామిక శక్తిపై ఎఐ ప్రభావం బహుముఖంగా ఉంటుంది. ఇందులో పునరావృతమయ్యే నిత్యకృత్యాల పనుల ఆటోమేషన్, మారుతున్న నైపుణ్య అవసరాలు, ఉద్యోగ స్థానభ్రంశం ఉంటాయి. ఇది ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇది మరింత సంక్లిష్టమైన, సృజనాత్మక పనిపై దృష్టి పెట్టడానికి వారిని స్వేచ్ఛగా చేస్తుంది. అయితే ఇది ఉద్యోగ స్థానభ్రంశం, కొన్ని రకాల ఉద్యోగాల డిమాండ్‌లో మార్పుల గురించి ఆందోళనలను కూడా సృష్టిస్తుంది.మెకిన్సే కంపెనీ నివేదిక ప్రకారం 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఎఐ 20-50 మిలియన్ల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదిక ప్రకారం 2025 నాటికి, ఎఐ ప్రపంచవ్యాప్తంగా 75 మిలియన్ల ఉద్యోగాలను స్థానభ్రంశం చేస్తుంది. కానీ 133 మిలియన్ల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది. దీని అర్థం ప్రపంచవ్యాప్తంగా 58 మిలియన్ల ఉద్యోగాలు పెరుగుతాయి. అయితే కొన్ని పరిశ్రమలలో ఇప్పటికీ గణనీయమైన ఉద్యోగ స్థానభ్రంశం ఉంటుంది. కృత్రిమమేధ ఉద్యోగాలను తొలగిస్తుందని, నిరుద్యోగాన్ని పెంచుతుందని తరచుగా భావించబడుతుంది. ఇంటర్నెట్, దాని ప్రారంభ దశలో ఉన్నప్పుడు కూడా ఇదే భావించబడింది, కానీ ఇంటర్నెట్ చాలా కొత్త ద్వారాలను తెరిచింది, ఆ సమయంలో ఎవరూ ఊహించని కొత్త పని అవకాశాలను వ్యక్తులకు అందించింది.కృత్రిమ మేధ పురోగతితో అదే విషయం సాధ్యమేనని మనం చెప్పగలం. ప్రస్తుత పరిస్థితిలో ఉత్తమ ఫలితాలను పొందడానికి మానవునితో కూడిన హైబ్రిడ్ బృందంతో పాటు కృత్రిమమేధ అవసరమని తేల్చవచ్చు. ముందున్నదంతా ఎఐ యుగమే. దీంతో ఇప్పటికే చాలా టెక్నాలజీ, ఫార్మా, కార్లు, ఇన్సూరెన్స్ ఏజెన్సీ, మొబైల్ కంపెనీలు ఎఐని విరివిగా ఉపయోగిస్తున్నాయి. -ప్రస్తుతం నిత్యావసర వస్తువుగా మారిన సెల్‌ఫోన్లలో కూడా ఎఐ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఎఐ కోర్సులు చేసినవారికి ప్రభుత్వ, ప్రైవేట్, విద్యా సంస్థలు, మిలిటరీ, రోబోటిక్స్, స్పేస్, మార్కెటింగ్, హెల్త్‌కేర్ రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. యాపిల్, ఫేస్‌బుక్, ఐబిఎం, యాక్సెంచర్, అమెజాన్, ఫ్రాక్టల్ అనలిక్స్, ఇంటెల్, శాప్‌ల్యాబ్స్, సొసైటీ జనరాలి, మైక్రోసాఫ్ట్, అడోబ్, అటోస్, ఎన్‌విడియా, టెక్ మహీంద్రా వంటి తదితర సంస్థలు ఎఐ చేసినవారిని రిక్రూట్ చేసుకుంటున్నాయి. ఇలా చాల రకాల ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఎఐ పాత్ర కీలకంగా మారింది.

## రోడ్డెక్కిన గ్రీన్‌ఫీల్డ్ భూ నిర్వాసితులు

చింతలపూడి,"గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ-, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేచర్ల వద్ద రైతులు రోడ్డెక్కారు. భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గాలు లేక, తమ పంటలు తెచ్చుకునే అవకాశం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక చోట్ల అండర్ పాస్ లు తగినంత ఎత్తు, వెడల్పు తో నిర్మాణం చేయకపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వలన ప్రతి గ్రామం పరిధిలో సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే అథారిటీ- అధికారులు, రెవిన్యూ అధికారులు, భూ సేకరణ అధికారులు క్షేత్ర స్థాయిలో గ్రామాల వారీగా రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పి.పాండు రంగారావు, సిఐటియు జిల్లా నాయకులు ఆర్.వీ.ఎస్ నారాయణ తదితరులు మాట్లాడుతూ రేచర్ల ఎగ్జిట్ వద్ద రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గం లేదన్నారు. సర్వీస్ రోడ్ ఏర్పాటు-చేస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. భూసేకరణలో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రేచర్ల నుండి లింగగూడెం వరకు ఉన్న అన్ని గ్రామాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవే వలన అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కారం చేయాలని కోరారు. ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు కొనకళ్ళ రాఘవరావు, ఉప్పల శ్రీనివాసరావు, ఆది జగన్, ఆది ధర్మారావు, కెక్కిరాల ఉపేంద్ర, బులుసు సతీష్,హరికృష్ణ, చీకటి సర్వేశ్వరరావు,పర్వతనేని మురళీ మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చేసిన వినతి పత్రం మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు హైవే అథారిటీ- అధికారులు, రెవిన్యూ అధికారులు, కేఎంవీఎల్ రోడ్డు నిర్మాణ సంస్థ మేనేజర్ తదితరులు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం వలన రైతులకు,ప్రజలకు వస్తున్న సమస్యలను పరిశీలించారు. రైతులు సమస్యలు ఏకరువు పెట్టారు. మా సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారంటూ నిలదీశారు. ఈలోపుగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారు. వినతి పత్రాలు అందజేశారు.

## ఉప్పొంగుతున్న యమునా నది

న్యూఢిల్లీ,గత కొన్ని రోజులుగా ఉత్తరాదిలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు, వరదల కారణంగా యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. హరియాణాలోని మయునానగర్‌లోని హత్నికుండ్ బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతుండడంతో అధికారులు గేట్లు- ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో దిల్లీలోని యమునా నది డేంజర్ మార్క్ దాటి ప్రవహిస్తోంది. ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుండడంతో యమునా తీర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు వరద హెచ్చరికను జారీ చేశారు. మంగళవారం తెల్లవారుజామున యమునా నది 205.33 మీటర్ల డేంజర్ మార్క్ దాటడంతో దేశ రాజధానిలో భారీ వరదలు పోటెత్తే అవకాశం ఉందని దిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే ఖాళీ చేసి, ప్రభుత్వం ఏర్పాటు-చేసిన సహాయక శిబిరాలకు చేరుకోవాలని సూచించింది. సోమవారం హరియాణాలోని హత్నికుండ్ బ్యారేజీ నుంచి మూడు లక్షలకు పైగా క్యూసెక్కులు విడుదల చేయడంతో నీటిమట్టం పెరిగినట్లు- తెలుస్తోంది. హత్నికుండ్ నుంచి విడుదలయ్యే నీటివల్ల సాధారణంగా 36 నుంచి 48 గంటల్లో నగరం మొత్తం వరదల్లో చిక్కుకుపోయే ప్రమాదం ఉందని.. పరిస్థితులను పర్యవేక్షించడానికి దిల్లీ యంత్రాంగం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేఖా గుప్త పేర్కొన్నారు. మరోవైపు మంగళవారం సాయంత్రంలోగా యమునా నది 206 మీటర్ల ఎత్తుకు చేరుకోవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీంతో పలు కార్యాలయాలు తమ ఉద్యోగులను ఇంటి నుంచే పని చేయాలని సూచించాయి. పలు పాఠశాలలు ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నట్లు-పేర్కొన్నాయి. భారీ వర్షాలకు వరద నీరు పో-టె-త్తడంతో దిల్లీ రోడ్లు జలమయమయ్యాయి. దిల్లీ-జైపూర్ హైవేపై 7-8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. దాదాపు 3 గంటలకు పైగా ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రతిపక్షాలు దిల్లీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## కాళేశ్వరం కేసు తేలదు..

హైదరాబాద్,కాళేశ్వరం కేసు కేంద్ర దర్యాప్తు సంస్థ చేతిలోకి వెళ్ళింది. కేంద్ర దర్యాప్తు సంస్థ చేతిలో కొన్ని వేల కేసులు ఉన్నాయి. ఇప్పటికే జగన్ అక్రమస్తుల కేసు సంవత్సరాలుగా పెండింగ్లోనే ఉంది. ఆయన కూడా బెయిల్ మీదనే ఉన్నారు. వివేక హత్య కేసు కూడా ఇంతవరకు తేలలేదు. ఇవే కాదు ఇంకా చాలా కేసుల్లో కూడా సిబిఐ అడుగులు అంత వేగంగా లేవు. సిబ్బంది కొరత కూడా కేంద్ర దర్యాప్తు సంస్థను తీవ్రంగా వేధిస్తోంది. ఇదే సమయంలో కాళేశ్వరం కేసు సిబిఐ చేతిలోకి వెళ్ళింది.. ఈ కేసు ఇప్పుడు తేలుతుందా? ఇప్పటికిప్పుడు శిక్ష పడుతుందా? అనే ప్రశ్నలు పక్కన పెడితే.. తెలంగాణ ముఖ్యమంత్రిని గులాబీ పార్టీ తక్కువ అంచనా వేసింది. ఇప్పటికీ కూడా రేవంత్ తమను ఏమీ చేయలేరనే ధీమాలోనే గులాబీ పార్టీ ఉంది.

తన భవిష్యత్తు అక్కడే నిర్మించుకున్నాడు

వాస్తవానికి తెలంగాణ ముఖ్యమంత్రి తన రాజకీయ భవిష్యత్తును మొత్తం తమ పార్టీ మీదనే నిర్మించుకున్నాడనే విషయాన్ని గులాబి నేతలు విస్మరిస్తున్నారు.. పింకు పార్టీ ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యవహరించిన తీరు వల్లే ఆయన ఒక్కసారి గా తెలంగాణలో హీరో అయిపోయాడు. కెసిఆర్ కు ప్రత్యామ్నాయ నాయకుడిగా ఎదిగాడు.. కాంగ్రెసులో గొప్ప గొప్ప నాయకులు ఉన్నప్పటికీ కొడంగల్ శాసనసభ్యుడిని అధిష్టానం ముఖ్యమంత్రి ని చేయాలని భావించిందంటే.. అతని స్టామినా ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు చూస్తున్న రాజకీయ ప్రణామాలను పరిశీలిస్తే తెలంగాణ సీఎం సాధారణ రాజకీయ నాయకుడిగా కాకుండా అసాధారణ వ్యక్తిగా ఎదుగుతున్నట్టు అర్థమవుతుంది. కేంద్ర దర్యాప్తు సంస్థ విషయంలో ప్రతిపక్షాలు భయపడి సాధారణ సమ్మతిని కూడా రద్దు చేశాయి. ఇలాంటి స్థితిలో ధైర్యంగా జీవో నెంబర్ 51 ను వెనక్కి తీసుకున్నాడు తెలంగాణ ముఖ్యమంత్రి. కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి తనను తాను.. తన పార్టీని కూడా రక్షించుకోగలను అనే ధీమా అతడిలో ఉంది. ఒక రకంగా ఇది రాహుల్ వల్ల కూడా కాలేదు.

# కల్వకుంట్ల కవితకు దారేది?



హైదరాబాద్,భారత రాష్ట్ర సమితి అధినేత కె. చంద్రశేఖర్ రావు కుమార్తె, ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం. ఈ నిర్ణయం కేవలం వ్యక్తిగత చర్య మాత్రమే కాకుండా బీఆర్ఎస్‌లో అంతర్గతంగా నెలకొన్న సంక్షోభాన్ని, నాయకత్వ పోరాటాలను బహిర్గతం చేసింది. ఈ పరిణామం బీఆర్ఎస్ భవిష్యత్తుపై, అలాగే తెలంగాణ రాజకీయాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపనుంది.

– అంతర్గత పోరాటాలు బహిర్గతం

కవిత సస్పెన్షన్ వెనుక పార్టీలోని అంతర్గత విభేదాలు ప్రధానంగా ఉన్నాయని స్పష్టమైంది. ఆమె బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు, ముఖ్యంగా మాజీ మంత్రులు హరీష్ రావు, సంతోష్ రావులపై పరోక్షంగా.. ప్రత్యక్షంగా చేసిన ఆరోపణలు పార్టీలో నెలకొన్న అసమ్మతిని బయటపెట్టాయి. 'కేసీఆర్ దేవుడు లాంటి వారు, కానీ ఆయన చుట్టూ దెయ్యాలున్నారు' అని కవిత చేసిన వ్యాఖ్యలు పార్టీలోని ఒక వర్గంపై ఆమెకున్న వ్యతిరేకతను స్పష్టం చేశాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి సంబంధించి ఆమె చేసిన వ్యాఖ్యలు, ప్రతిపక్షాలకు ఒక బలమైన ఆయుధంగా మారాయి.

– సస్పెన్షన్ వెనుక ఉన్న కారణాలు

ఈ సస్పెన్షన్ నిర్ణయానికి ప్రధానంగా ఈ కొన్ని కారణాలు దోహదం చేశాయి.. పార్టీ నాయకత్వంపై, ముఖ్యంగా కేసీఆర్‌కు సన్నిహితులైన వారిపై కవిత బహిరంగంగా విమర్శలు చేయడం పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడంగా భావించారు. అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అవినీతిని సొంత నాయకురాలే బయటపెట్టడం బీఆర్ఎస్ ప్రతిష్టను దెబ్బతీసింది. కవిత, హరీష్ రావు మధ్య ఉన్న విభేదాలు పార్టీలో ప్రధాన సమస్యగా మారాయి. ఈ విభేదాలు పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని భావించిన అధిష్టానం కఠిన చర్యలు తీసుకుంది.

– తెలంగాణ రాజకీయాలపై ప్రభావం

కవిత సస్పెన్షన్ తెలంగాణ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. అధికారం కోల్పోయి బలహీనపడిన బీఆర్ఎస్, ఇప్పుడు కుటుంబంలోనే ఉన్న విభేదాలు బహిర్గతం కావడంతో మరింత బలహీనపడవచ్చు. ఇది పార్టీ నాయకుల్లో గందరగోళాన్ని సృష్టించవచ్చు. కవిత భవిష్యత్తులో ఏ పార్టీలో చేరతారనేది ఆసక్తికరమైన అంశం. కాంగ్రెస్ లేదా బీజేపీలలో చేరవచ్చని ఊహాగానాలు ఉన్నప్పటికీ, ఆమె తన సొంత రాజకీయ పార్టీని ఏర్పాటు చేయవచ్చని తెలుస్తోంది. బంజారాహిల్స్ లో ఒక భవనాన్ని అద్దెకు తీసుకుని, దీపావళి రోజున పార్టీ పేరును ప్రకటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనతో బీఆర్ఎస్ నుండి మరికొందరు నాయకులు ఇతర పార్టీలలో చేరే అవకాశం ఉంది. కవితకు సన్నిహితులైన నాయకులు ఆమెతో కలిసి కొత్త మార్గాన్ని అనుసరించవచ్చు.కవిత సస్పెన్షన్ కేవలం ఒక రాజకీయ నిర్ణయం కాదు, ఇది బీఆర్ఎస్ అంతర్గత సంక్షోభానికి ఒక స్పష్టమైన సంకేతం. పార్టీలో విభేదాలు, నాయకత్వ పోరాటాలు ఇంకా కొనసాగుతున్నాయని ఈ ఘటన రుజువు చేసింది. ఆమె తన శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేస్తారా, లేదా కొత్త పార్టీని స్థాపిస్తారా అనేది తెలంగాణ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో సంచలనం సృష్టించవచ్చు. ఈ పరిణామం బీఆర్ఎస్ భవిష్యత్తుపై, తెలంగాణ రాజకీయాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపనుంది.

# వైఎస్ వారసురాలిగా.. షర్మిలకు ఎన్ని మార్కులు..?



ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిల గురించి కొన్ని ప్రధాన పత్రికల్లో తాజాగా పతాక శీర్షిక వార్తలు వచ్చాయి. వైఎస్ వారసురాలిగా ఆమె ఏ మేరకు మార్కులు వేసుకున్నారు.. ఏ మేరకు పార్టీని పుంజుకునేలా చేశారు.. ప్రజల ఏమనుకుంటున్నారు.. అనే మూడు విషయాలపై మీడియా ప్రధానంగా దృష్టి సారించింది. ఇది ఒక మీడియాలోనే కాదు పార్టీలోనూ కొన్నాళ్లుగా జరుగుతున్న చర్చ. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం షర్మిలకు పిసిసి చీఫ్ పదవిని ఇవ్వడం వెనుక ఆమె పెట్టుకున్న పార్టీని విలీనం చేయటం ఒకటే కారణం కాదు.. అన్న విషయం అందరికీ తెలిసిందే.మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చరిష్మా ఉందని, అది తమకు ఉపయోగపడుతుందని%ా% ఇప్పటికే పార్టీ నుంచి వెళ్లిపోయిన వారందరినీ ఏకం చేసి పార్టీని బలోపేతం చేస్తారని, ఆంధ్రప్రదేశ్ ప్రజల మనసు దోచుకుంటారని ఇలా ఎన్నో ఆశలతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం షర్మిలకు అవకాశం కల్పించింది. అయితే, పార్టీ పగ్గాలు చేపట్టి దాదాపు సంవత్సరన్నర దాటిపోయిన తర్వాత కూడా షర్మిల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారిపోయింది అన్నది విశ్లేషకులు చెబుతున్న మాట. పార్టీలోనూ ఇదే తరహా చర్చ నడుస్తున్న విషయం అందరికీ తెలిసిందే.వ్యక్తిగత అజెండాను పెట్టుకొని అన్నపై యుద్ధం చేయటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీని ఉపయోగించుకుంటున్నారని రఘువీరారెడ్డి వంటి సీనియర్ నాయకులు అనేక సందర్భాల్లో అంతర్గత సమావేశాల్లో చెప్పుకొచ్చారు. ఇక చాలామంది నాయకులు మౌనంగా ఉండిపోయారు. మరికొందరు పార్టీ మారిపోయారు. తాజా పరిణామాలు గమనించిన అదే పరిస్థితి గమనిస్తోంది. గత ఏడాది ఎన్నికల్లో చావు దెబ్బతిన్న కాంగ్రెస్ పార్టీ మళ్లీ పుంజుకునే దిశగా అడుగులు వేస్తుందని అందరూ అనుకున్నారు.కానీ, 16 నెలలు గడిస్తున్న ఇప్పటికీ కాంగ్రెస్ తరపున ఒక ప్రజా పోరాటం గాని ఒక ప్రజా ఉద్యమంగానే సమస్యలపై ప్రశ్నించడం కానీ ఎక్కడ కనిపించకపోవడం వినిపించకపోవడం గమనార్హం. కేవలం అన్నను టార్గెట్గా చేసుకుని ఆయనపై విమర్శలు గుప్పించేందుకు అధికార పార్టీల తరపున వాయిస్ వినిపించేందుకు మాత్రమే పరిమితం అవుతున్నారన్న విమర్శలు జోరుగా నడుస్తున్న సమయంలో ఆమె వైయస్ మార్కును కూడా అందుకోలేకపోతున్నారన్నది మీడియాలో వస్తున్న వార్తలను బట్టి తెలుస్తోంది. వాస్తవానికి వైఎస్ చరిష్మాను కనుక షర్మిల అందుకుని ఉంటే ఎప్పుడో అనేకమంది పార్టీ నాయకులు చేరువయ్యే వారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో మళ్లీ కాంగ్రెస్ సౌరభాలు కనిపించేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ఎవరికి వారు ఎక్కడికక్కడ షర్మిల విషయంపై మౌనంగానే ఉన్నారు.. తప్ప ఆమె వ్యవహరిస్తున్న తీరును మాత్రం జీర్ణించుకోలేకపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. వైఎస్ వారసురాలిగా ఆమె విఫలమయ్యారు అన్నది ప్రస్తుతం పార్టీ అధిష్టానం కూడా ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. మరి మునుముందు కూడా ఇలాగే కొనసాగితే ఆమెకు కేవలం నాయకురాలుగా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడుతుందని విశ్లేషకులు చెబుతున్న మాట. మరి ఏం చేస్తారో చూడాలి.

# బాబు సవాల్‌కు వైసీపీ స్పందన..

అమరావతి,ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం రాజంపేటలో పర్యటించిన సందర్భంగా రాష్ట్ర ప్రతిపక్ష(ప్రధాన కాదు) పార్టీ వైసీపీ అధినేతను ఉద్దేశించి గట్టి సవాలే రువ్వారు. దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలకు రావాలని.. ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాము 'సిద్ధం'గా ఉన్నామని.. చెప్పారు. ఈ సందర్భంగా ఆయన గత ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్, ఆయన నాయకులు సిద్ధం – సిద్ధం అంటూ.. చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. "అప్పట్లో సిద్ధం అన్నారుగా.. ఇప్పుడు సిద్ధమేనా? రండి అసెంబ్లీలో తేల్చుకుందాం. అభివృద్ధి నుంచి సంక్షేమం వరకు.. కోడికత్తి డ్రామా నుంచి గులకరాయి నాటకాల దాకా.. వివేకానందరెడ్డి దారుణ హత్య వరకు అన్నింటిపైనా చర్చిద్దాం." అని జగన్‌కు చంద్రబాబు సవాల్ రువ్వారు.ఈ వ్యవహారంపై తాజాగా వైసీపీ స్పందించింది. అయితే.. నేరుగా జగన్ కాకుండా.. ఆ పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇంచార్జ్, గత ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి రియాక్ట్ అయ్యారు. చంద్రబాబు సవాల్ ఏడ్చినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఆయన చేసిన సవాల్ ప్రజలకు ఉపయోగపడేనా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని.. కొందరికే తల్లికి వందనం పథకం అందిందని, రైతులు వరదలు, వర్షాల కారణంగా నానా తిప్పలు పడుతున్నారని, ఇక, యూరియా అందక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని సజ్జల చెప్పుకొచ్చారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు.ఈ క్రమంలో ఆయా అంశాలపై చర్చకు సిద్ధమని చంద్రబాబు చెప్పాలని సజ్జల డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడే అంశాలపై ఎవరైనా చర్చిస్తారని.. అన్నారు. కానీ, అసెంబ్లీని రాజకీయ వేదిక చేసుకుని, ప్రజాధనంతో నడిచే సభను రాజకీయాలకు ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తానని చెప్పడం.. ఆయన 30 ఏళ్ల ముఖ్యమంత్రి అనుభవానికి ప్రతీకా? అని నిలదీశారు. ఏదైనా ఉంటే.. తాము సవాల్ విసరాలని.. కానీ, సీఎం స్వయంగా రా.. తేల్చుకుంటాం! అంటే.. ఎవరైనా నవ్వుతారా? లేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబును చూసి ఇతర నాయకులు



కూడా రెచ్చిపోతున్నారని సజ్జల వ్యాఖ్యానించారు. ఈ తరహా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఉన్న సమస్యలపై చర్చిస్తామని అంటే.. బాగుండేదన్నారు.

సభకు వెళ్తారా?

ఇక, తమ పార్టీ తరఫున గెలిచిన 11 మంది సభ్యులు సభకు వెళ్తారా? లేదా? అనే విషయంపై సజ్జల క్లారిటీ ఇవ్వలేదు. ఈ విషయాన్ని పార్టీ నేత చూస్తారని.. తమకు ప్రధాన ప్రతిపక్ష హోదాఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో తమకంటే ఎక్కువ సంఖ్యలో సీట్లు తెచ్చుకుని.. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం కాని పార్టీ ఉంటే.. అప్పుడు తాము ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వమని అడిగేవారం కాదని అన్నారు. కానీ, అలా లేనప్పుడు.. ఉన్న ఒకే ఒక్క పార్టీకి ప్రధాన ప్రతిపక్షం ఇవ్వకపోవడంలో ఆంతర్యం కూడా చంద్రబాబు చెప్పాలని కోరారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉందని.. దీనిపై పార్టీ అధినేత తీసుకునే నిర్ణయానికి ఎమ్మెల్యేలు కట్టుబడి పనిచేస్తారని సజ్జల వ్యాఖ్యానించారు.

# వరదల పరిష్కారానికి పాక్ మంత్రి వింత సలహా



ఇస్లామాబాద్: పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి తన విచిత్రమైన వ్యాఖ్యలతో ట్రోల్ అవుతున్నారు. పాకిస్తాన్‌ను వరదలు ముంచెత్తిన వేళ.. ఆ వరదల్ని ప్రజలు వరంగా భావించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాదు వరద ప్రవాహనాన్ని అడ్డుకునేందుకు వరద నీటిని బకెట్లు,ట్యూబ్‌లలో నింపాలని విజ్ఞప్తి చేశారు.పాక్‌లో ఇటీవల రికార్డ్ స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఫలితంగా రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న పంజాబ్ ప్రావిన్స్ మొత్తం నీట మునిగింది. 24 లక్షల మంది పౌరులు వరద ముంపుకు గురయ్యారు. వేలాది గ్రాముల నీట మునిగాయి. భారీ ఎత్తున ఆస్తినష్టం,ప్రాణ నష్టం సంభవించింది. ఈ క్రమంలో ఆదేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్థానిక మీడియా సంస్థ దున్యా న్యూస్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూలో ఆసిఫ్ మాట్లాడుతూ..వరద ముంపు గురైన ప్రజలే.. వరద నీటిని ఇంట్లోకి తోడుకోవాలి. ప్రజలు ఈ వరద నీటిని తమ ఇళ్లలో టబ్‌లు, కంటైనర్లలో నిల్వ చేసుకోవాలి. వరద నీటిని దేవుడి ఆశీర్వాదంగా చూడాలి. అందుకే ఆ నీటిని నిల్వచేయాలని' పిలుపునిచ్చారు. అంతేకాదు, పాకిస్తాన్ 10-15 సంవత్సరాలు మెగా ప్రాజెక్టుల కోసం వేచి ఉండకుండా త్వరగా పూర్తి చేయగల చిన్న,చిన్న డ్యామ్‌లను నిర్మించాలని ఆసిఫ్ సూచించారు.మనం నీటిని కాలువలోకి వదిలేస్తున్నాం.అలా వదిలేయకూడదు.ఆ నీటిని నిల్వ చేసుకోవాలన్నారు. పాకిస్తాన్‌లో భారీ వర్షాల కారణంగా, పంజాబ్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులలో వరద పరిస్థితి నెలకొంది. 5 లక్షల మంది తమ ఇళ్లను వదిలి వెళ్ళవలసి వచ్చింది. పాకిస్తాన్ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (NDMA) ప్రకారం జూన్ 26 నుంచి ఆగస్టు 31 వరకు పాకిస్తాన్‌లో వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 854కి పెరిగింది. 1100 మందికి పైగా గాయపడ్డారు. NDMA ప్రకారం మరణాలలో మూడింట రెండు వంతుల మంది ఇళ్ళు కూలిపోవడం, ఆకస్మిక వరదల కారణంగా సంభవించగా వందలాది మంది మృతి చెందారు. పంజాబ్ చరిత్రలో ఇది అతిపెద్ద వరద అని పంజాబ్ మంత్రి ఔరంగజేబ్ అన్నారు. సట్లెజ్, చీనాబ్, రావి నదుల నీటి మట్టం ఇంతగా పెరగడం ఇదే మొదటిసారి.

# జగన్ పవన్ ఎందుకలా ?



అమరావతి,ఏపీ రాజకీయాలు బహు చిత్రంగా ఉంటున్నాయి. రాజకీయ దిగ్గజంగా ఉంటూ రాజకీయాలను అలాగే చూస్తూ చేస్తున్న చంద్రబాబు వంటి వారు ఉన్న చోట సైతం ఇతర నాయకులు ఆయన వైఖరిని ఎంతవరకూ అనుసరిస్తున్నారు అన్న చర్చ అయితే ఉంటోంది. ఏపీ రాజకీయ నాయకులు అయితే ప్రత్యర్థులుగా ఎక్కడా భావించడం లేదు, శత్రువులుగానే చూస్తున్నారు. ఈ పెడ ధోరణి వల్లనే రాజ్ భవన్ లో తేనీటి విందుకు అంతా కలవలేక పోతున్నాను. అంతే కాదు రాజకీయేతర కార్యక్రమాలలో సైతం ఒకరికి ఒకరు ఎదురు పడలేకపోతున్నారు. ఇదిలా ఉంటే తాజాగా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వచ్చింది. ఆయనకు ప్రధాని మోడీ నుంచి సీఎం చంద్రబాబు మంత్రి నారా లోకేష్ ఇలా మంత్రివర్గం మొత్తం గ్రీట్ చేసింది. అలాగే సినీ పరిశ్రమ యావత్తు ఆయనకు అభినందనలు తెలియచేసింది.

వైసీపీ మాత్రం అలాగే :

అయితే వైసీపీ నుంచి పవన్ కి గ్రీట్ చేస్తూ ఒక్క ట్వీట్ కూడా పడకపోవడం పట్ల అయితే చర్చ సాగుతోంది. ఇది కేవలం ఈ ఏడాదికి సంబంధించిన విషయం మాత్రమే కాదు ప్రతీ ఏటా ఇలాగే జరుగుతోంది. దాంతో ఎందుకు ఇలా అని అంతా అనుకునే నేపథ్యం ఉంది. రాజకీయాలు వేరు వ్యక్తిగతం వేరు అన్నది అంతా గ్రహిస్తే ఇలాంటివి ఉండవని అంటున్నారు కానీ ఏపీలో మాత్రం వేరేగా చూస్తున్నారు అని అంటున్నారు

నాడు ట్వీట్ చేసినా :

ఇకపోతే పవన్ రెండవ కుమారుడు సింగపూర్ లో అగ్ని ప్రమాదంలో చిక్కుకున్నారు అన్న వార్త విన్న వెంటనే జగన్ అతని ఆరోగ్యం బాగుండాలని ట్వీట్ చేశారు. దానిని తరువాత పవన్ సైతం ధన్యవాదాలు చెబుతూ రిప్లై ఇచ్చారు. ఇలా చూస్తే బాగానే ఉంది అనుకున్నా పుట్టిన రోజు పూటా చిన్న పాటి ట్వీట్ అయినా వేయలేదేమిటి అన్నదే చర్చగా ఉంది. పవన్ సైతం రాజకీయాల్లో ఉన్నారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు. సాటి రాజకీయ పక్షంగా భావించి ఆయనకు జన్మ దిన వేడుకలకు శుభాకాంక్షలు చెబితే అది ఏపీ రాజకీయాలకు మంచి సానుకూల సంకేతం పంపినట్లు అవుతుంది కదా అని అంటున్నారు

పవన్ సైతం అలాగే :

ఇది కేవలం వైసీపీ వైపు నుంచే కాదు జనసేన అధినేత పవన్ విషయంలోనూ జరుగుతోంది. పవన్ కూడా జగన్ పుట్టిన రోజుకు శుభాకాక్షలు చెప్పిన దాఖలాలు లేవని వైసీపీ నేతలు గుర్తు చేసుకుంటారు. ఇద్దరూ ఏపీ రాజకీయాల్లో చాలా కాలం రాజకీయాలు చేయాల్సిన వారు కానీ ఇలాంటి విషయాలలో మాత్రం ఎందుకో ఒకే తీరుగా వ్యవహరిస్తున్నరు అని అంటున్నారు. దాంతో ఇద్దరి మధ్యన ఏమి జరిగింది అన్నది కూడా అంతా చర్చిస్తూంటారు. అయితే చిత్రంగా చూస్తే ఇద్దరూ కలిసింది కూడా ఈ రోజుకీ లేదు అంటే అది ఆశచర్యమే.

బాబు జగన్ మధ్యన :

ఇక ఏపీ రాజకీయాలలో బాబు జగన్ ఉప్పు నిప్పులా వ్యవహరిస్తారు. కానీ చంద్రబాబు పుట్టిన రోజున కచ్చితంగా జగన్ ట్వీట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు చెబుతారు. అలాగే చంద్రబాబు సైతం జగన్ పుట్టిన రోజున ఆయనకు అభినందనలు తెలియచేస్తారు. ఈ విషయంలో మెచ్చుకోవాల్సింది చంద్రబాబునే అని చెప్పాలి. ఆయన రాజకీయాలను అలాగే చూస్తారు వ్యక్తిగతానికి ముడి పెట్టరు. దాంతోనే బహుశా వైసీపీ వైపు నుంచి సానుకూలత వస్తోంది అని అంటారు. బాబు వంటి సీనియర్ నేత నుంచి ఇలాంటి విషయాలలో స్ఫూర్తిని తీసుకుంటే ఏపీ రాజకీయాల్లో మంచి పరిణామాలు వస్తాయని అంటున్నారు. చూడాలి మరి భవిష్యత్తులో ఏమైనా మారుతాయేమో.

# కాళేశ్వరం కాక : సీబీఐ ఎంట్రీ ఎపుడు ?

కాళేశ్వరం,దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన విచారణ సంస్థగా సీబీఐకి పేరుంది. సీబీఐ విచారణని ఈ రోజుకి అంతా కోరుతారు ఏ కేసు అయినా తీవ్రం అని భావిస్తే సీబీఐకి ఇచ్చేయమంటారు. అంతలా నమ్మకం సీబీఐ మీద జనంలో ఉందని రాజకీయ జనం అభిప్రాయం. అందుకే సీబీఐ విచారణకు సిద్ధమేనా అని ప్రత్యర్థులను సవాల్ చేస్తూంటారు. ఇదిలా ఉంటే తెలంగాణాలో కాళేశ్వరం ప్రాజెక్ట్ అటు తిరిగి ఇటు తిరిగి సీబీఐ విచారణ దాకా వెళ్ళింది. ఏకంగా తెలంగాణా ప్రభుత్వం సీబీఐ విచారణ కోరుతూ నిర్ణయం తీసుకుంది.

అతి పెద్ద ఖర్చుతో కూడిన ప్రాజెక్ట్ :

కాళేశ్వరం ప్రాజెక్ట్ ని భారీ ఎత్తున ఖర్చు చేసి మరీ నిర్మించారు. ఏకంగా ఒక లక్షా 47 వేల కోట్ల రూపాయలు ఈ ప్రాజెక్ట్ కి ఖర్చు అయింది అని నివేదికలు చెబుతున్నారు. గోదావరి నీటిని ఒడిసిపట్టుకుని తెలంగాణా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసుకోవడానికి ఈ భారీ ప్రాజెక్ట్ ని తలపెట్టినట్లుగా బీఆర్ఎస్ నేతలు చెబుతూ ఉంటారు. అయితే అప్పులు భారీ వడ్డీలకు తెచ్చి మరీ ఈ ప్రాజెక్ట్ ని చేపట్టారని అయితే ఈ ప్రాజెక్ట్ ద్వారా అనుకున్న లక్ష్యాలు నెరవేరలేదని కానీ అప్పుల కుప్పలా తెలంగాణా మారడానికి ఒక కారణంగా మారిందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆక్షేపిస్తోంది.

సీబీఐ అక్నాలెడ్జ్మెంట్ తో :

ఇదిలా ఉంటే ఈ కేసుని సీబీఐకి అప్పగిస్తునామని తెలంగాణా ప్రభుత్వం చెప్పడమే కాదు సీబీఐకి తెలియజేసింది దాంతో సీబీఐ ఈ కేసు విషయంలో అక్నాలెడ్జ్మెంట్ ఇచ్చింది. అంటే ఈ కేసు విషయంలో సీబీఐ ఏమి చేయబోతోంది అన్నదే ఇపుడు చర్చగా ఉంది. మరో వైపు చూస్తే కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద సీబీఐ విచారణ మీద హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. దాని మీద విచారించిన హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 7వ తేదీ వరకూ కేసీఆర్ మీద కానీ హరీష్ రావు మీద కానీ ఎలాంటి చర్యలు తీసుకోవద్దు అని ఆదేశాలు జారీ చేసింది.

కేసుల భారంతో సీబీఐ :



మరో వైపు చూస్తే దేశంలో అత్యంత ప్రతిష్ట కలిగిన దర్యాప్తు సంస్థగా సీబీఐ ఉంది. దాంతో దేశవ్యాప్తంగా సీబీఐ మీద కేసుల భారం ఉంది. ఇప్పటిదాకా చూస్తే సీబీఐ పరిధిలో ఉన్న అవినీతి కానీ అక్రమాలపైన వివిధ కోర్టులలో విచారించే కేసుల సంఖ్య కానీ చూస్తే కనుక 7,022 ఉన్నట్లుగా చెబుతున్నారు ఇది ఎవరో చెప్పినది కాదు కేంద్ర నిఘా కమిషన్ ప్రతీ ఏటా ఇచ్చే నివేదికలో వెల్లడించింది. ఇవన్నీ పెండింగులో ఉండగా మరో 379 కేసులు అయితే ఏకంగా రెండు దశాబ్దాలకు పైగా పెండింగులో ఉన్నట్లుగా కూడా చెబుతున్నారు. అలాగే మరో 1506 కేసులు చూస్తే కనుక అవి 2024 డిసెంబర్ నెలాఖరు నాటికి పెండింగులో ఉన్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ లో చోటు చేసుకున్న అవినీతి నిగ్గు తేల్చాలని తెలంగాణా ప్రభుత్వం సీబీఐని కోరింది. సీబీఐ ఈ కేసుని విచారించినా ఇప్పట్లో తేలుతుందా అన్నదే చర్చ. అంతే కాదు మరో మూడేళ్ళలో తెలంగాణాలో ఎన్నికలు ఉన్నాయి అప్పటికి అయినా తేలే అవకాశాలు చూస్తే చాలా తక్కువ అని అంటున్నారు ఇవన్నీ పక్కన పెడితే సీబీఐ ఎపుడు ఎంట్రీ ఇస్తుంది అన్నది కూడా చర్చగా ఉంది. ఇక సీబీఐ ఎంట్రీ ఇస్తే కనుక నోటీసులు ఇచ్చి మరీ బీఆర్ఎస్ పెద్దలను విచారణకు పిలుస్తుందా అన్నది మరో ఉత్కంఠను కలిగించే విషయంగా చెబుతున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# కర్రలతో కాదు.. గొడ్డలితో తిరిగి వస్తారు.. వైసీపీ నేత హాట్ కామెంట్స్..



అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో కూటమి నేతలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది.. తాజాగా, తెలుగుదేశం పార్టీ నేతలను ఉద్దేశిస్తూ..వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.. గతంలో కర్ర పట్టుకుని వచ్చే వాళ్ల.. రేపు గొడ్డలితో వస్తారన్నారు గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి.. మాచవరంలో బాబు షూరిటీ %-% మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఈ హాట్ కామెంట్స్ చేశారు.టీడీపీ నాయకుల వేధింపులతో ఇప్పుడు ఊర్లు వదిలిపెట్టి వెళ్లినవారు.. మళ్లీ తిరిగి వస్తారని తెలిపారు కాసు.. మీరు గ్రామం దాటించారని.. రేపు రాష్ట్రం దాటి వెళ్లే పరిస్థితి వస్తుందంటూ వార్నింగ్ ఇచ్చారు.. తెగించే వరకూ తీసుకెళ్తున్నారని వ్యాఖ్యానించిన ఆయన.. వైసీపీ నాయకులు తెగిస్తే టీడీపీ తట్టుకోలేరని హెచ్చరించారు.. వీధి వీధిలో పరుగెత్తించి తంతారంటూ సీరియస్ కామెంట్లు చేశారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి.. ఇక, పార్టీకి సంబంధించిన అన్ని కమిటీలు పూర్తి చేయాలి.. అన్ని సామాజిక వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు..

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com